నేటి దినపత్రిక
సూర్య
అమరావతి
గుంటూరు, కృష్ణా, ఎన్టీఆర్
సోమవారం 8 జనవరి 2024 పేజీలు 11



# తంతా.. నా కొ...

- మేడ కడితే నువ్వు హీరోవా.. నీ మేడా.. నువ్వు.. అంత పొగరా నీకు..
- ఇది ఓ వైసీపీ ఎమ్మెల్యే.. గ్రామ ఎస్టీ నేతతో మాట్లాడిన తీరు

## పేటలో వైరల్‌గా మారిన ఉదయభాను బూతుల పురాణం

- ఎస్సీ, ఎస్టీలపై దౌర్జన్యాలకు పాల్పడుతున్న వైనం
- పరారీలో బాధితుడు
- అతనికి ఏమైనా జరిగితే ఎమ్మెల్యేనే బాధ్యత వహించాలి
- ఎస్సీ, ఎస్టీ కేసులు ప్రజాప్రతినిధులకు వర్తించవా..?
- ప్రశ్నిస్తున్న స్థానిక ఎస్సీ, ఎస్టీ నేతలు, ప్రజలు

(విజయవాడ బ్యూరో, జనవరి 7, మేజర్ న్యూస్)

స్వాతంత్య్రం వచ్చింది.. తరాలు మారుతున్నాయి.. నాయకులు మారిపోతున్నారు.. కానీ తమ బుజలపై ఇప్పటికి ఎంతో మందిని నమ్మి మోసిన ఎస్టీ, ఎస్టీ, బీసీ నేతల పరిస్థితి మాత్రం ఇన్ని దశాబ్దాలు గడిచిన ఇంకా మారడం లేదు.. తమ పక్కన కుర్చోపెట్టుకుని ఒక్క రోజు భోజనం తినిపించగల నేతలు ఉన్నారే కానీ.. తమ ఇంటికి పిలిపించుకుని మంచిగా అన్నం పెట్టే నేతలే ఈ రోజుకు కరువయ్యారు. ఎన్నికలలో తాము నెగ్గడానికి అవసరమైన వ్యక్తి(ఓటు).. గెలిచిన తర్వాత కనీసం మరి అవసరం లేకుండా పోతుందనే చెప్పాలి.. తాము పట్టించుకున్న, పట్టించుకోక పోయిన తాము పిలవగానే పరిగెత్తుకుని రావాలి.. లేకుంటే ఏమైనా చేస్తామనే మనస్తత్వంతో ఇంకా.. ఇప్పటికి నేతలు ప్రవర్తిస్తున్న తీరు.. అందరికోసం మేమంటున్న రాజకీయ నాయకులను తమ ఆత్మవిమర్శ చేసుకోమంటోంది...

మిగతా 2లో...

## అందుకే వైసీపీకి రాజీనామా..

అంబటి రాయుడు వివరణ

● వివరాలు 2లో



## మంగళగిరి ఆలయాల్లో నారా లోకేశ్ ప్రత్యేక పూజలు

గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో : గుంటూరు జిల్లా మంగళగిరిలోని ప్రముఖ ఆలయాలను తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ కుటుంబ సమేతంగా సందర్శించారు. తల్లి భువనేశ్వరి,

మిగతా 2లో





# వైసీపీకి ఓటేస్తే..

## జాతికి ద్రోహం చేసినట్లే..

## జగన్ ఏపీలో విధ్వంసం సృష్టించారు

ఎన్టీఆర్ జిల్లా బ్యూరో/తిరువూరు, జనవరి 7, మేజర్ న్యూస్ : వైసీపీ ప్రభుత్వ పాలనలో ఏపీ 30 ఏళ్లు వెనక్కిపోయిందని, మళ్లీ కోలుకోలేని విధంగా రాష్ట్రాన్ని జగన్ మోహన్ రెడ్డి దెబ్బతీశారని మాజీ ముఖ్యమంత్రి టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు అన్నారు.

2

- రాబోయే ఎన్నికల్లో వైసీపీని చిత్తుగా ఓడిద్దాం
- త్వరలో టీడీపీ - జనసేన మేనిఫెస్టో
- హైదరాబాద్ వెలిగిపోతుంటే.. అమరావతి వెలవెలబోతోంది
- తిరువూరులో 'రా.. కదలి రా' బహిరంగ సభలో టీడీపీ అధినేత చంద్రబాబు

జగనన్న పాలనలో..

## ఎనలేని గుర్తింపు



- వైద్యులకు ఏడో వేతన సవరణను అమలు
- కొత్త నియామకాల వల్ల వైద్యులకు తగ్గిన పని ఒత్తిడి
- గుంటూరు ప్రభుత్వాస్పత్రిని అద్భుతంగా తీర్చిదిద్దుతున్నాం
- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజినివెల్లడి
- గుంటూరు ప్రభుత్వ వైద్య కళాశాలలో ఆత్మీయ సమావేశం

వివరాలు 2లో

(మొదటిపేజీ తరువాయి)

## తంతా.. నా కొ...



ఇదే విషయాన్ని మరో సారి రుజువు చేస్తూ జగ్గయ్యపేట ఎమ్మెల్యే సామినేని ఉదయభాను తీరు వెలుగులోకి వచ్చింది. తాను గెలిచిన తరువాత తనను పట్టించుకోలేదని, తనకు వద్దకు రాని ఎస్టీ నేతను రాకుంటే తంతా.. నా కొ.. అంటూ ఎమ్మెల్యే తిడుతున్న తీరు.. మేడ కట్టుకుంటే నీవు హీరోవా అనే తీరు.. ఎమ్మెల్యే భాను ఎస్టీలకు ఇస్తున్న మర్యాదను అందరికి గుర్తు చేస్తోంది.. ఎస్సీ, ఎస్టీ, బీసీలు మేడలు కట్టుకోకూడదా.. మమల్ని నొప్పించారు మేము రామని చెప్పకూడదా.. చెబితే నిన్ను తాంతా.. ఏమైనా చేస్తా అనొచ్చా..? ఇదేనా ప్రజాస్వామ్యం.. ఇదేనా రాజన్న పాలన.. ?

**ఇక స్థానిక పరిస్థితి ఇలా...**

రాష్ట్రంలో ఎన్నికల షెడ్యూలు దాదాపుగా ఖరారు అయినట్లు తెలుస్తుంది. ఈ నేపథ్యంలో తమ అధిష్ఠానం గుర్తింపు కోసం స్థానిక శాసనసభ్యులే కాక పార్టీ నియోజకవర్గ ఇన్చార్జులు అనేక రకాల ప్రయత్నాలు చేస్తున్నారు. కొంతమంది రాజకీయ నాయకుల్లో తమకు సీటు దక్కుతుందా లేదా అనే సందిగ్ధంలో గుండెల్లో గుబులుపుడుతుంది. ఈ తరుణంలో జగ్గయ్యపేట వైసీపీ సీటు కోసం బలమైన సామాజిక వర్గమైన కమ్మ సామాజిక వర్గం వారు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. నియోజకవర్గంలో సామినేని ఉదయభాను గ్రాఫ్ రోజు రోజుకి పడిపోవడంతో రాష్ట్ర అధిష్టానం దగ్గర ఉదయభానుకి సరైన గుర్తింపు లేదని ప్రచారం జరుగుతోంది. వైసీపీ తరపున పోటీ చేసేందుకు కమ్మ సామాజిక వర్గానికి చెందిన బలమైన నాయకుడు కోసం జగన్ ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. అదే జరిగితే జగ్గయ్యపేట వైసీపీ సీటు ఉదయభాను కు దాదాపుగా దక్కదని రాజకీయ నాయకులు భావిస్తున్నారు. పేట సీటుపై తర్జనభర్జన పడుతున్న ఉదయ భాను కి "మూలిగే నక్క మీద తాటికాయ పడినట్టు" ఎస్సీ ఎస్టీ లపై తాను చేసిన బూతుల పురాణాలతో పాటు తన అనుచరులు చేసిన దౌర్జన్యాలు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. గత ఎన్నికల్లో జగన్ గాలిలో, ఎస్సీ, ఎస్టీ, బీసీలు ఓట్ బ్యాంకుతో గెలిచిన ఉదయభాను గెలిచిన తర్వాత వారిని విస్మరించడం జరిగిందనే ప్రచారం బాగా వినిపిస్తోంది. అంతేగాక జగనన్న కాలనీలకు చిల్లకల్లు, తొర్రగుంటపాలెం, భీమవరం, బూదవాడ, బలుసుపాడు తదితర గ్రామాలలో ఎస్సీ, ఎస్టీ భూములను ఆక్రమించుకో వడానికి వారిని బెదిరించడం, వారిపై అక్రమ కేసులు పెట్టడం కూడా జరిగిందని సోషల్ మీడియాలో ఇప్పటికే వైరల్ అవుతుంది.

ప్రస్తుతం పెనుగంచిప్రోలు మండలం అనిగండ్లపాడు గ్రామ సర్పంచ్ వాహనాలు ప్రమాదాలకు గురి కావటం వెనుక రాజకీయ కుట్ర జరుగుతోందని అని కొందరు స్థానికులు భావిస్తున్నారు. ఈ విధంగా ఆయన అరాచకాలను మీడియా ద్వారా బయటపెట్టిన వారిపై అక్రమ కేసులు పెట్టడం, బెదిరించి మీడియా స్వేచ్ఛను హరించి వేయడం, ఇలా అనేక దౌర్జన్యాలకు పాల్పడిన విషయాలు ఇప్పుడు బయటకు పొక్కుతున్నాయి. ఈ విధంగా జగ్గయ్యపేటలో భానుకి వ్యతిరేక పవనాలు వీస్తున్నాయి అని రాజకీయ విశ్లేషకులు అనుకుంటున్నారు.

## మంగళగిరి ఆలయాల్లో నారా లోకేశ్ ప్రత్యేక పూజలు

సతీమణి బ్రాహ్మణి, కుమారుడు దేవాన్ష్ కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రదక్షిణ చేసిన అనంతరం పండితుల వేదమంత్రోచ్చారణల మధ్య స్వామివారికి కిరీటం అలంకరించారు. ఆ తర్వాత రాజ్యలక్ష్మి అమ్మవారి ఆలయానికి వెళ్లి పూజలు నిర్వహించారు. అక్కడ పట్టువస్త్రాలు సమర్పించి వేదపండితుల ఆశీర్వచనం అందుకున్నారు.

# వైసీపీకి ఓటేస్తే జాతికి ద్రోహం చేసినట్లే..

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్రాన్ని కాపాడుకునేందుకు ప్రజలంతా కదలి రావాలని పిలుపునిచ్చారు. ఎన్టీఆర్ జిల్లా తిరువూరులో నిర్వహించిన 'రా.. కదలి రా' బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. "ఓ పక్క హైదరాబాద్ వెలిగిపోతుంటే మరో పక్క అమరావతి వెలవెలబోతోంది. దీనికి కారణం జగన్ రివర్స్ పాలన. ఓ వ్యక్తి వల్ల ఒక రాష్ట్రం, ఒక తరం ఇంతగా నష్టపోయిన పరిస్థితి ప్రపంచంలోనే ఎక్కడా లేదు. ఒక అసమర్థుడు అధికారంలోకి వస్తే కొంతవరకు నష్టం కలుగుతుంది. దుర్మార్గుడి పాలనలో రాష్ట్రంలో తిరిగి కోలుకోలేని విధంగా దెబ్బతింది. ఈ రాష్ట్రంలో నాతో సహా అందరూ బాధితులే. అరాచక పాలనకు చరమగీతం పాడాలని కోరుతున్నాన్నారు.

**మూడు నెలల్లో రైతు రాజ్యం**

ప్రపంచంలో తెలుగుజాతి నంబర్ వన్‌గా ఉండాలనేది నా ఆకాంక్ష. తెలుగు ప్రజలు ప్రపంచ రాజకీయాల్లో రాణించే పరిస్థితి వస్తుంది. తెలుగుజాతి గ్లోబల్ నాయకులుగా ఎదిగేందుకు టీడీపీ ఉపయోగపడింది. వైసీపీకి ఓటేస్తే జాతికి ద్రోహం చేసినట్లవుతుంది. రాష్ట్రంలో వ్యవసాయ శాఖను మూసేశారు. ధాన్యం రైతులు దగాపడ్డారు. అప్పుల్లో రాష్ట్ర రైతులు అగ్రస్థానంలో ఉన్నారు. కౌలు రైతుల ఆత్మహత్యల్లో ఏపీ రెండో స్థానంలో ఉంది. రైతుల బతుకులు బాగుపడాలంటే టీడీపీ-జనసేన ప్రభుత్వం రావాలి. సైతాన్ ప్రభుత్వం పోవాలి..రైతే రాజుగా మారాలి. మూడు నెలల్లో రైతు రాజ్యం వస్తుందన్నారు.

**మా రాజధాని అమరావతి అని గర్వంగా చెప్పుకొంటారు**

ఐదేళ్లు ఏపీని రాజధాని లేని రాష్ట్రంగా చేశారు. మూడు రాజధానుల పేరుతో మూడు ముక్కలాట ఆడారు. రుషికొండను బోడిగుండు చేసి రూ.500కోట్లతో ప్యాలెస్ కట్టారు. ఏపీ రాజధానిగా అమరావతే ఉంటుంది. మా రాజధాని అమరావతి అని గర్వంగా చెప్పుకొనే రోజు వస్తుంది. టీడీపీ హయాంలో ఉద్యోగాలు వస్తే జగన్ గంజాయి తెచ్చారు. యువతను మత్తులో ఉంచి ఏమైనా చేయాలనుకుంటున్నారు. మీ భవిష్యత్తుకు నేను గ్యారంటీ ఇస్తా. రాష్ట్రంలోని యువతను ప్రపంచంలో నంబర్ వన్‌గా మారుస్తానన్నారు.



**త్వరలో టీడీపీ-జనసేన మేనిఫెస్టో**

దొంగ ఓట్లు చేర్పించి గెలుస్తామని వైసీపీ నేతలు అనుకుంటున్నారు. ఆ పార్టీ ఆటలు సాగవని గుర్తుంచుకోవాలి. సంక్షేమ పథకాలకు నాంది పలికింది టీడీపీ. జగన్ పాలనలో వంద పథకాలను రద్దు చేశారు. ఈ ప్రభుత్వాన్ని భూ స్థాపితం చేయాలని ప్రజలు భావిస్తున్నారు. 'బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారంటీ' పేరిట సూపర్ సిక్స్ అందిస్తాం. ఐదేళ్లలో 20 లక్షల మంది యువతకు ఉద్యోగాలు కల్పిస్తాం. నిరుద్యోగులకు రూ.3వేల భృతి అందిస్తాం. 'అన్నదాత' కింద రైతులకు రూ.20వేలు అందజేస్తాం. 'జయహో బీసీ' కింద ప్రత్యేక చట్టం తీసుకొస్తాం. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు న్యాయం చేస్తాం. టీడీపీ-జనసేన ఆధ్వర్యంలో త్వరలో ఎన్నికల మేనిఫెస్టో విడుదల చేస్తామన్నారు.

**అంబటి రాయుడును మోసగించారు**

సొంత పార్టీ ఎమ్మెల్యేలను జగన్ నమ్మడం లేదు. ప్రజలు ఆయన్ను నమ్మట్లేదు. ఎమ్మెల్యేలను బదిలీ చేసిన సందర్భాలు గతంలో లేవు. గుంటూరు ఎంపీ టికెట్ పేరుతో అంబటి రాయుడును మోసగించారు. ఆ టికెట్‌ను మరొకరికి కేటాయించడంతో ఆయన వైసీపీ నుంచి బయటకు వెళ్లిపోయారు. ప్రజలకు సేవ చేసిన వారికి వైసీపీ సీట్లు ఇవ్వలేదు. నన్ను, పవన్, లోకేశ్‌ను దూషిస్తేనే టికెట్లు ఇస్తున్నారు. కార్యకర్తలు ఇంటింటికీ తిరిగి ప్రజల్లో చైతన్యం తేవాలి. రాష్ట్రాన్ని కాపాడుకునేందుకు అందరూ సిద్ధం కావాలని చంద్రబాబు పిలుపునిచ్చారు.

# జగనన్న పాలనలో ఎనలేని గుర్తింపు

**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో :** ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పరిపాలనలో వైద్యులకు ఎనలేని గుర్తింపు, గౌరవం దక్కాయని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని తెలిపారు. గుంటూరు ప్రభుత్వ వైద్య కళాశాలలోని జింఖానా ఆడిటోరియంలో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించారు. మంత్రి విడదల రజిని ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి విడదల రజిని మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా వైద్యులకు పదోన్నతులు ఇచ్చిన ఘనత జగనన్నదే అని చెప్పారు. వైద్యుల వేతనాలను కూడా గణనీయంగా పెంచిన ప్రభుత్వం తమదేని తెలిపారు. కరోనా సమయంలో రోగుల ప్రాణాలు కాపాడే విషయంలో వైద్యులు ఎంతో చిత్తశుద్ధితో పనిచేశారని, ఆ సమయంలో ప్రపంచ వ్యాప్తంగా వైద్యుల త్యాగాలను ఎవరూ మర్చిపోరని పేర్కొన్నారు. వైద్యుల త్యాగానికి, కష్టానికి ధన్యవాదాలు తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో వైద్య వృత్తికి, వైద్యులకు గౌరవం పెరిగిందన్నారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వంలో వైద్యులకు తొలిసారి అత్యంత ప్రాధాన్యత దక్కిందని గుర్తుచేశారు. వైద్యులకు తొలిసారి యూజీసీ పే స్కేల్ అమలు చేసిన ముఖ్యమంత్రిగా వైఎస్సార్ కీర్తి గడించారని తెలిపారు. ఆయన తనయుడిగా జగన్ అంతకుమించి వైద్యుల ఆత్మ గౌరవాన్ని కాపాడుతున్నారని వెల్లడించారు.

**జీజీహెచ్ అభివృద్ధికి కృషి**

గతంలో ఎన్నడూ లేని విధంగా గుంటూరు జీజీహెచ్ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపిస్తున్నట్లు మంత్రి రజిని తెలిపారు. జీజీహెచ్ క్యాన్సర్ సెంటర్‌ను గ్రేడ్ వన్ లెవల్‌కు పెంచామని తెలిపారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా జీజీహెచ్ క్యాన్సర్ సెంటర్‌కు రూ.20 కోట్ల పెట్‌సీటీ స్కాన్ ఇచ్చామని చెప్పారు. సీటీస్కాన్ పరికరం కొనుగోలుకు రూ. 4 కోట్లు ఇచ్చామని, సర్వీస్ బ్లాక్ నిర్మాణం కోసం రూ.7.5 కోట్లు ఇచ్చామని వివరించారు. ప్రభుత్వ వైద్యుల యూనియన్ నాయకులు, జూనియర్ డాక్టర్స్ యూనియన్ నాయకులు మంత్రిని కలిసి వినతి పత్రం అందజేశారు. వైద్యుల సమస్యలపై మంత్రి రజిని వెంటనే స్పందించి ఎరియర్స్ సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని, టైమ్‌బాండ్ ప్రమోషన్స్ ఇచ్చేందుకు కమిటీ వేస్తామని హామీ ఇచ్చారు. పీజీ వైద్యులకు ఎఫ్ఆర్ఎస్ హాజరు విషయంలో మినహాయింపు ఇస్తామని, మహాప్రస్థానం వాహనాలు అదనంగా ఏర్పాటు చేస్తామని, జీజీహెచ్ సమస్యలను తక్షణమే పరిష్కరిస్తామని మంత్రి పేర్కొన్నారు.

గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహ్మద్ ముస్తఫా, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ సీఎం జగన్ వైద్య రంగానికి వేలకోట్లు ఖర్చుపెట్టి ప్రతి పేదకు ఉచితంగా ఆరోగ్యం అందిస్తున్నారని కొనియాడారు.

ఈ కార్యక్రమంలో డైరక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ సర్వీసెస్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు అకడమిక్ డీఎంఈ డాక్టర్ సూర్యశ్రీ, డైరక్టర్ ఆఫ్ హెల్త్ డాక్టర్ పద్మావతి, గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్, గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టీటీకే రెడ్డి, ఏపీ ప్రభుత్వ వైద్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జయధీర్, రాష్ట్ర సెక్రటరీ డాక్టర్ రమేష్, గుంటూరు అధ్యక్షుడు డాక్టర్ ఎన్ఎస్‌వి రమణ, డీఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి, జింకానా కోఆర్డినేటర్ డాక్టర్ వెనిగళ్ల బాలభాస్కరరావు తదితరులు పాల్గొన్నారు. జూనియర్స్ డాక్టర్స్ అసోసియేషన్, ప్రభుత్వ వైద్యుల సంఘం నేతలు మంత్రి విడదల రజినిని ఘనంగా సన్మానించారు. జిల్లాకు చెందిన పలువురు ప్రభుత్వ వైద్యులు, వైద్యాధికారులు పాల్గొన్నారు.

# అందుకే వైసీపీకి రాజీనామా..



**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో :** అధికార వైసీపీ కు మాజీ క్రికెటర్ అంబటి రాయుడు రాజీనామా కలకలం రేపిన విషయం తెలిసిందే. రాజకీయాల్లో ఆడకుండానే అవుటయ్యారంటూ పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి. దీంతో అంబటి రాయుడు ట్విటర్ (ఎక్స్) వేదికగా వివరణ ఇచ్చారు. "జనవరి 20 నుంచి దుబాయ్‌లో జరగబోయే ఇంటర్నేషనల్ లీగ్ టీ20లో ఎంఐ ఎమిరేట్స్‌కు ప్రాతినిధ్యం వహిస్తాను. వృత్తిపరమైన క్రికెట్ ఆడుతున్నప్పుడు రాజకీయాలకు దూరంగా ఉండాల్సిన అవసరముంది" అని పేర్కొన్నారు.

పార్టీలో చేరిన పది రోజులకే గుడ్‌బై

అంతర్జాతీయ క్రికెటర్‌గా గుర్తింపు పొందిన తెలుగు బిడ్డ అంబటి రాయుడిని వైసీపీ పెద్దలు నమ్మించి మెల్లగా తమ పార్టీ వైపు తిప్పుకొన్నారు. క్రికెట్‌కు రిటైర్‌మెంట్ ప్రకటించగానే ఆయన్ను ముఖ్యమంత్రి జగన్ పిలిపించుకుని మాట్లాడారు. ప్రస్తుత గుంటూరు జిల్లాకు తన వంతు ఏదైనా చేయాలన్న రాయుడి ఆలోచనలను పంచుకుని రాజకీయ గాలం వేశారు. ముందు గుంటూరు లోక్‌సభ (ప్రస్తుతం గుంటూరు జిల్లా మొత్తం) పరిధిలో తిరగాలని, అవగాహన వచ్చాక రాజకీయ ఉన్నతికి సహకరిస్తామని పార్టీ పెద్దలు నమ్మబలికారు. అప్పటినుంచి ఆర్నెల్లపాటు రాయుడు జిల్లా అంతటా వ్యయప్రయాసలకోర్చి తిరిగారు. కాలక్రమంలో.. 'ఆడుదాం ఆంధ్ర' అంటూ గత నెలలో గుంటూరులోనే సీఎం ప్రారంభించిన కార్యక్రమానికి స్వతహాగా క్రీడాకారుడైన, పార్టీ పురోగతికి శ్రమిస్తున్న రాయుడికి ఆహ్వానం అందలేదు. అయినా ఆయన సర్దుకుపోయారు. గత నెల 28న ముఖ్యమంత్రే స్వయంగా కండువా కప్పి వైసీపీలో ఆయన్ను చేర్చుకున్నారు. అంతటితోనే ఆగలేదు.. గుంటూరు లోక్‌సభ స్థానం మీదేనని, అక్కడినుంచి పోటీ చేయండని చెప్పారు. ముఖ్యమంత్రి హామీ లభించడంతో పోటీకి సంబంధించి రాయుడు సన్నాహాలు చేసుకుంటున్నారు. కానీ.. శుక్రవారం నరసరావుపేట ఎంపీ శ్రీకృష్ణదేవరాయలను పిలిచి మాట్లాడిన ముఖ్యమంత్రి.. ఆయన్ను ఈసారి గుంటూరు లోక్‌సభ స్థానానికి మారాలని సూచించారు. ఆయన ససేమిరా అనడంతో ఆలోచించుకుని రావాలని సీఎం పంపించారు.

'గుంటూరు లోక్‌సభ టికెట్ నాదేనని నమ్మబలికి పార్టీలో చేర్చుకుని.. ఇప్పుడు ప్రత్యామ్నాయాల వైపు సీఎం ఎందుకు ప్రయత్నిస్తున్నారు? నాకు టికెట్ ఇవ్వాలనే ఆలోచనే లేకపోతే ఇస్తామని చెప్పడమెందుకు? పార్టీలో చేర్పుకోవడమెందుకు? నమ్మించి ఇలా గొంతు కోస్తారా?' అని ఆయన సన్నిహితుల వద్ద వాపోయినట్లు తెలిసింది. ఈ నమ్మకద్రోహం నుంచి కోలుకోలేక రాజకీయాలకు కొంతకాలం దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నారు. బ్యాట్ పట్టకముందే అవుటయ్యారు. 'వైసీపీ నుంచి క్విట్ చేయాలని నిర్ణయించుకున్నా.. కొంతకాలం రాజకీయాలకు దూరంగా ఉండాలనుకుంటున్నా..తదుపరి కార్యాచరణను రాబోయే రోజుల్లో వెల్లడిస్తా'నని సామాజిక మాధ్యమంలో అభిప్రాయాన్ని వెల్లడించారు. తదుపరి కార్యాచరణను రాబోయే రోజుల్లో వెల్లడిస్తానని పేర్కొన్నారు. స్పష్టత కోసం ఆయన ప్రయత్నించగా.. వైసీపీ పెద్దల నుంచి సరైన స్పందన రాలేదని తెలిసింది. వైసీపీలో చేరి పట్టుమని పది రోజులు అవకుండానే రాయుడు పార్టీకి గుడ్‌బై చెప్పేశారు.

# మ్యాగ్నిఫ్లెక్స్ పరుపుల అమ్మకాల్లో గణనీయమైన వృద్ధి



**విజయవాడ, జనవరి 7, మేజర్ న్యూస్ :** యూరప్‌లోని ప్రముఖ మ్యా ట్రెస్ బ్రాండ్, 62 సంవత్సరాల సుసంపన్నమైన వారసత్వం, ఇటాలియన్ మూలాలు కలిగిన మాగ్నిఫ్లెక్స్ ఇండియా (మేడ్ ఇన్ ఇటలీ) డైనమిక్ స్టేట్ ఆంధ్ర ప్రదేశ్‌లో గణనీయమైన వృద్ధిని అంచనా వేస్తోంది. విజయవాడలో ఎన్నో లగ్జరీ బ్రాండ్‌లు తమ ఎక్స్ పీరియన్స్ సెంటర్స్ ఏర్పాటు చేశాయి. కోవిడ్-19 తర్వాత నాణ్యమైన పరుపులకు ఉత్పత్తులకు డిమాండ్ పెరిగింది. ఈ ధోరణి విలాసవంతమైన పరుపులలో పెట్టుబడి పెట్టేందుకు, సంపూర్ణ జీవనశైలికి కట్టుబడి ఉండటానికి దారి తీసింది. ముఖ్యంగా, ఇటాలియన్ బ్రాండ్ మాగ్నిఫ్లెక్స్ ఇండియా ద్వారా ఉదహరించబడిన అప్‌స్కేల్ మ్యాట్రెస్ పరిశ్రమ రూ.21 కోట్లకు మించి వార్షిక ఆదాయం సాధించేలా చేసింది. ఇది 40% వార్షిక వృద్ధిని సాధించింది. తన ఉనికిని పెంపొందించుకోవడానికి, మాగ్నిఫ్లెక్స్ ఇండియా ఇప్పుడు ఎర్గో ట్రె ఎలక్ట్రిక్ బెడ్‌ను పరిచయం చేసింది. దేశవ్యాప్తంగా వినియోగదారుల కోసం మాగ్నిఫ్లెక్స్ ఇన్వెస్ట్ మెంట్ ప్లాన్ (ఎంఐపీ) ని అందుబాటు లోకి తెచ్చింది. విజయవాడ మార్కెట్ వృద్ధిపై మాగ్నిఫ్లెక్స్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ ఆనంద్ నిచాని మాట్లాడుతూ, "విజయవాడలో లగ్జరీ మార్కెట్ అనూహ్యంగా పుంజుకుంది, ఆరోగ్య ప్రయోజనాలతో కూడిన అధిక-నాణ్య త, ప్రీమియం ఉత్పత్తుల వైపు వినియోగదారుల ప్రాధాన్యత గణనీయంగా మారింది. ఈ మార్పు పెరుగు తున్న ప్రజల కొనుగోలు శక్తిని సూచిస్తుంది. ఆంధ్రప్రదేశ్ అమ్మకాల్లో 2023లో 28% వృద్ధిని సాధించాం. ఈ క్రమంలోనే 2024-25లో 30%కి పైగా విస్తరించాలని భావిస్తున్నాం. మా మార్కెట్ ను మార్చి 2024 నాటికి రాజమండ్రి, నెల్లూరు,తిరుపతి వంటి అభివృద్ధి చెందుతున్న ప్రాంతాలకు విస్తరించాలని లక్ష్యంగా పనిచేస్తున్నాం. ఆ తరువాత వైజాగ్, విజయవాడ, నెల్లూరు వంటి సంభావ్య ప్రాంతాలపై దృష్టిపెట్టనున్నాం. " అని అన్నారు. ప్రస్తుత వినియోగదారుల కొనుగోలు నిర్ణయాలలో ఆరోగ్యానికి ప్రాధాన్యం ఉంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని, మాగ్నిఫ్లెక్స్ ఇండియా ఎర్గో ట్రె ఎలక్ట్రిక్ బెడ్‌ను ప్రారంభించింది. ఇది హ్యాండ్‌హెల్డ్ రిమోట్ ద్వారా నియం త్రించబడే విలాసవంతమైన, ఫంక్షనల్ ఉత్పాదన. ఈ పరుపులో శరీర మద్దతుకు తగ్గట్టు ఎర్గోనామిక్ ప్లేట్‌లను కలిగి ఉంటుంది. దీని కారణంగా నిద్రించే సమయంలో తల, పాదాలను పైకి లేపవచ్చు. ఈ కారణంగా వెన్నెముకపై ఒత్తిడి తగ్గుతుంది. ఇది వెన్నునొప్పి, గురక, యాసిడ్ రిఫ్లక్స్, స్లీప్ అప్నియా, వెరి కోస్ వెయిన్స్, పాదాల వాపు వంటి సమస్యలు కూడా తగ్గుతాయి. రాష్ట్రంలో నాణ్యమైన పరుపుల కోసం పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా మాగ్నిఫ్లెక్స్ ఇండియా మా గ్నిఫ్లెక్స్ ఇన్వెస్ట్ మెంట్ ప్లాన్ని ప్రవేశపెట్టింది, దాని అన్ని ఉత్పత్తులలో నెలకు రూ.3,535తో సమా నమైన నెలవారీ వాయిదా పథకాలను అందిస్తోంది. నాణ్యమైన పరుపులు, మెరుగైన ఆరోగ్యాన్ని ఆస్వాదించడంలో పెట్టుబడి ప్రాముఖ్యతను నొక్కి చెబుతోంది.

# జోగి హయాంలో నియోజకవర్గ అభివృద్ధి శూన్యం



**పెడన మేజర్ న్యూస్ :** స్థానిక మంత్రి తన స్వార్ధ ప్రయోజనాల కోసమే పనిచేశాడగాని నియోజకవర్గ అభివృద్ధి కోసం ఏమాత్రం పని చేయలేదని జనసేన జిల్లా అధ్యక్షులు రామకృష్ణ విమర్శించారు ఈ మేరకు టిడిపి జనసేన ఉమ్మడి కార్యక్రమాన్ని ది పెడన ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు ఈ సందర్భంగా బండ్రెడ్డి మాట్లాడుతూ మొన్న వచ్చిన తుఫాన్ కి రైతులు పూర్తిగా నష్టపోయారని వారికి ఈ వైసీపీ హయాంలో ఏ మాత్రం న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు మరల పంటలు వేసుకువటానికి విత్తనాలు కూడా ఇవ్వటానికి అనేక రకాల ఇబ్బందులకు రైతులను గురి చేయటం చూసామని పేర్కొన్నారు.రాబోయే ఎన్నికలలో ఉమ్మడి జనసేన టిడిపి పార్టీల అభ్యర్థి మంచి మెజారిటీతో గెలవడం ఖాయమని తెలిపారు. బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం కూడా నూటికి నూరు శాతం పూర్తి చేస్తామని అన్నారు.నియోజవర్గ అభివృద్ధిలో పూర్తి వైఫల్యం చెందటం వల్ల స్థానిక మంత్రికి స్థానాచలం కలిగించే యువచనలో ఆయన ముఖ్యమంత్రి ఉండటం ప్రజలందరూ గమనిస్తున్నారని తెలిపారు ఈ కార్యక్రమంలో జడ్పిటిసి అర్జ వెంకట నగేష్, మండల టిడిపి అధ్యక్షుడు సెలపాటి ప్రసాదు, కార్యదర్శి సీరం ప్రసాదు, నియోజకవర్గ జనసేన సమన్వయకర్త పంచకర్ల సురేష్, జనసేన వైసిపి కౌన్సిల్ సభ్యురాలు మట్ట శివ పావని, కోనపరెడ్డి రంగయ్య, రాము, షఫీ, కృత్తివెన్ను బంటుమిల్లి గూడూరు మండల జనసేన నాయకులు తదితరులు ఉన్నారు.



## చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందజేసిన తంగిరాల సౌమ్య

**నందిగామ, జనవరి 7, మేజర్ న్యూస్:**తిరువూరు భారీ బహిరంగ సభలో జాతీయ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు,అధినేత నారా చంద్రబాబునాయుడుని తెదేపా నేతల బృందంతో కలిసి మర్యాదపూర్వకంగా కలుసుకుని పుష్పగుచ్ఛం మాజీ శాసనసభ్యురాలు తంగిరాల సౌమ్య అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు టిడిపి సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బహిరంగ సభకు తరలి వెళ్లిన శ్రేణులు





**నందిగామ, జనవరి 7, మేజర్ న్యూస్:**నారా చంద్రబాబు నాయుడుతిరువూరు భారీ బహిరంగ సభకు రా.. కదలిరా.. అంటూ తెదేపా శ్రేణులు భారీగా తరలివెళ్లారు. తెదేపా నేతల వాహనాలకు జండా ఊపి ప్రారంభించి తెదేపా శ్రేణులతో మాజీ శాసనసభ్యురాలు తంగిరాల సౌమ్య బయలుదేరారు. ఈ కార్యక్రమంలో వివిధ హోదాలలో ఉన్న తెలుగుదేశం పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# వ్యవస్థలను విధ్వంసం చేయడమే జగన్ లక్ష్యం



**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** వ్యవస్థలను విధ్వంసం చేయడమే రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యం అని, గడిచిన నాలుగున్నర సంవత్సరాల్లో జగన్‌మోహన్‌రెడ్డి సాధించింది ఏమీ లేదని, ప్రజాస్వామ్యం గొంతును నొక్కుతున్న జగన్ రెడ్డిని బటన్ నొక్కి తరిమే కార్యక్రమం చేపట్టాలని జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు మండలి వెంకట్రామ్ అన్నారు. బాబు షూరిటీ భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా ఆదివారం 4వ వార్డులో ఇంటింటికి తెలుగుదేశం, జనసేన పార్టీల ఉమ్మడి మిని మానిఫెస్టో కరప్రతాలను పంపిణీ చేసి మాట్లాడారు. రాష్ట్ర భవిష్యత్తు బాగుండాలంటే చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ఉమ్మడి ప్రభుత్వం రావాలని, అభివృద్ధి బాంధవుడైన చంద్రబాబును గెలిపించుకుందామని వెంకట్రామ్ అన్నారు. జగన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చి 5 సంవత్సరాలు కావస్తున్నప్పటికి రాష్ట్రంలో చేసిన అభివృద్ధి ఇది అని చెప్పుకునేందుకు ఏదీ లేదని మండలి ధ్వజమెత్తారు. బటన్ నొక్కె కార్యక్రమం పేరుతో హడావిడి చేస్తూ ధరలు, పన్నులు, భాదుడు చార్జీల పేరుతో పేద ప్రజల గొంతు నొక్కుతున్నాడని జగన్‌రెడ్డిని రాష్ట్రం నుండి తరిమినప్పుడే రాష్ట్ర అభివృద్ధి సకారం అవుతుందని, మిని మానిఫెస్టోలోని పథకాలను వివరించారు. తెలుగుదేశం, జనసేన పార్టీల ఆధ్వర్యంలో అధికారంలోనికి వస్తే చేయబోయే కార్యక్రమాలను వివరించారు. మహాశక్తి ఇచ్చే ఆడబిడ్డ నిధి, చదువులకు అందించే ప్రోత్సాహకాలు, ఉచిత ఆర్.టి.సి ప్రయాణం, బిసి రక్షణ చట్టం, అన్నదాత, ఉచిత సిలెండర్లు పథకాల ద్వారా జరిగే మేలును ఇంటింటికి కరపత్రాలు పంపిణీ చేస్తూ వివరించారు. చంద్రబాబు సంపద సృష్టించి పేదలను సంపన్నులుగా మార్చేందుకు ప్రణాళిక రచించారని, సంపదను సృష్టించగల సత్తా కలిగిన నాయకుడు చంద్రబాబు నాయుడు మాత్రమేనని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు యాసం చిట్టిబాబు, మాజీ జడ్.పి.టి.సి కొల్లూరి వెంకటేశ్వరరావు, జిల్లా ఎస్.సి సెల్ నేతలు, మాచవరపు ఆదినారాయణ, బడే సుబ్బారావు, ఆది, మండల రాంమోహన్‌రావు, దాసినేని శ్రీనివాసరావు, గరికిపాటి హరిబాబు, యలవర్తి చిన్న లతో పాటు పలువురు పాల్గొన్నారు.



## ఉత్సాహంగా పూర్వవిద్యార్థుల సమావేశం

**హనుమాన్ జంక్షన్, జనవరి 7, మేజర్ న్యూస్ :** పూర్వవిద్యార్థుల సమావేశం ఉత్సాహంగా సాగింది. ఏలూరు సర్ సీఆర్. రెడ్డి కళాశాలలో 1987-89వ సంవత్సరం ఇంటర్ మీడియట్ బైపీసీ చదివిన విద్యార్థుల ఆత్మీయ సమావేశం ఆదివారం హనుమాన్ జంక్షన్ నూజివీడు రోడ్లోని ఓ ఫంక్షన్ హాలులో జరిగింది. 33 సంవత్సరాల తరువాత తొలిసారి కలుసుకున్న వీరు ఒకరినొకరు పరిచయం చేసుకుని ఆనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. కాలేజీ రోజుల్లో చేసిన అల్లరి ని గుర్తు చేసుకున్నారు. ఉదయం నుండి సాయంత్రం వరకు అట పాటలతో ఉల్లాసంగా గడిపారు. ఈ కార్యక్రమంలో అట్లూరి రాజశేఖర్, కేతినీడి ధర్మేంద్ర, సాంబ, సత్తిబాబు, డాక్టర్ కోటగిరి శ్రీకాంత్, శ్యామ్, అలీ, రమేష్, రామచంద్రరావు, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## బెజవాడ వసంతరావుకి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు నివాళులు



**నందిగామ, జనవరి 7, మేజర్ న్యూస్:** పట్టణంలోని 7 వ వార్డు సిద్ధార్థ నగర్ లో వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు బెజవాడ రాజశేఖర్ తండ్రి బెజవాడ వసంత రావు (డియ్యా) ఆదరణ కూడిక కార్యక్రమంలో పాల్గొని ఆయన చిత్రపటానికి శాసనసభ్యులు డాక్టర్ మొండితోక జగన్ మోహన్ రావు, శాసన మండలి సభ్యులు డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్ పూలమాలలు నివాళులర్పిం చారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్ర మంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



## రెడ్డిగూడెం బీసీ హాస్టల్‌లో సంక్రాంతి సంబరాలు



**రెడ్డిగూడెం, మేజర్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు రెడ్డిగూడెం బీసీ బాలుర వసతి గృహంలో ఆదివారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. హాస్టల్ వార్డెన్ కట్టా రమాదేవి ఆధ్వర్యంలో సిబ్బంది కొప్పుల హేమలత, అమ్ములు హాస్టల్ ఆవరణలో కనువిందు చేసి ముగ్గులు వేసి హాస్టల్ ముఖ ద్వారంను పచ్చ తోరణాలతో ఆలంకరిం చారు. వసతి గృహంలో సంక్రాంతి సంబ రాలు నిర్వహించడం అనందంగా ఉందని వార్డెన్ రమాదేవి తెలిపారు. కాగా బీసీ హాస్టల్ వసతి గృహంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించడం పట్ల విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు హాస్టల్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

## ఎస్మా చట్టాన్ని ఉపసంహరించుకోవాలి : గడ్డం రాజు

**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** ఎస్మా చట్టాన్ని ఉపసంహరించుకోవాలని రాష్ట్ర బీసీ నాయకులు జనసేన పార్టీ నగర అధ్యక్షులు గడ్డం రాజు డిమాండ్ చేశారు. అంగన్వాడీలపై ప్రభుత్వం ప్రయోగించిన ఎస్మా చట్టాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని రాష్ట్ర బీసీ నాయకులు జ నసేన పార్టీ నగర అధ్యక్షులు గడ్డం రాజు డిమాండ్ చేశారు. 27 రోజు లుగా ఆంధ్రప్రదేశ్‌లో అంగన్వాడి కార్యకర్తలు సేవకులు వారి జీతాలు పెంచి కనీస వేతనం ఇవ్వమని టిఏ, డిఏలు కల్పించి ప్రభుత్వ ఉద్యోగులు గా గుర్తించాలని రిటైర్ అయిన తర్వాత జీవనం సాగేలా సదుపాయాలు కల్పించమని న్యాయమైన కోరికలు కోరుతూ నిరవధిక సమ్మె చేస్తున్న అంగన్వాడీలపై ప్రభుత్వం ఉక్కు పాదం మోపటం పిచ్చుకపై బ్రహ్మాస్త్రం లాంటిదన్నారు. అంగన్వాడీల నిరసన దీక్షకు మద్దతుగా బీసీ సంఘాలు నిలుస్తాయని లక్షకు పైగా కుటుంబాలను రోడ్డున పడవేయడం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నిరంకుశ పాలనకు అద్దంపడుతుందని ఈ విధానం ప్రజాస్వామ్య పాలనకు విరుద్ధమని రాష్ట్ర వ్యాప్తంగా వారి పోరాటానికి మద్దతు ఉంటుందని రాజు హెచ్చరించారు.

## శాంసంగ్ తదుపరి గెలాక్సీ స్మార్ట్‌ఫోన్ రిజర్వేషన్ ప్రారంభం

**విజయవాడ మేజర్ న్యూస్ :** భారతదేశపు అతిపెద్ద ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ శాంసంగ్, తన తదుపరి ఫ్లాగ్‌షిప్ గెలాక్సీ స్మార్ట్‌ఫోన్ యొక్క ముందస్తు రిజర్వేషన్‌ను ప్రకటించింది. ఈ స్మార్ట్ ఫోన్ ఈ నెలాఖరులో ఆవిష్కరించబడుతుంది. ముందుగా రిజర్వ్ చేసుకున్న కస్టమర్‌లు కొత్త గెలాక్సీ పరికరాలను కొనుగోలు చేయడంపై ముందస్తు యాక్సెస్, ప్రత్యేక ఆఫర్‌లకు అర్హులు. ప్రముఖ రిటైల్ అవుట్‌లెట్‌లలో రూ. 2000 టోకెన్ మొత్తాన్ని చెల్లించడం ద్వారా కస్టమర్‌లు ఫ్లాగ్‌షిప్ గెలాక్సీ ఉపకరణాలను ముందుగా రిజర్వ్ చేసుకోవచ్చు. ముందుగా రిజర్వ్ చేసుకున్న వినియోగదారులు రూ. 5000 విలువైన ప్రయోజనం పొందుతారు.

## విజయవాడకు కాపు కాసుకుంటూ పనిచేస్తా : ఎంపీ




**విజయవాడ రూరల్ మేజర్ న్యూస్:** ప్రజాప్రతినిధిగా పని చేసుకుంటూ వెళ్లడమే నా లక్ష్యంమని, నా చివరి శ్వాస వరకు విజయవాడకు కాపు కాసుకుంటూ పనిచేస్తానని విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శ్రీనివాస్ (నాని) అన్నారు. ఆదివారం విజయవాడ ఎంపీ కార్యాలయం కేశినేని భవన్ వద్ద మైలవరం నియోజకవర్గం, రెడ్డిగూడెం మండలం, జి కొండూరు మండల పరిధిలోని 19 గ్రామాల త్రాగునీటి ఎద్దడి నివారణలో భాగంగా 19 వాటర్ ట్యాంకర్లను గ్రామ పంచాయతీ కార్యదర్శులకు ఎంపీ అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని నాని మాట్లాడుతూ నాకు ప్రోటోకాల్ ఇచ్చామని చెప్పుకోవడానికి సీటు, బ్యానర్లు వేసుంటారని, విజయ వాడ పార్లమెంట్ పరిధిలోని 288 గ్రామాలకు వాటర్ ట్యాంకర్లను పంపిణీ చేశామన్నారు. దానిలో భాగంగా ఇప్పటికీ సుమారు 150 వాటర్ ట్యాంకర్లను అందజేశాంమని, ఇంకో 100 వాటర్ ట్యాంకర్లను నెలాఖరు లోపు అందజేస్తాం అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డబ్ల్యూఎస్ అధికారులు పలు గ్రామ సర్పంచులు, కేశినేని అభిమానులు తదితరులు పాల్గొన్నారు..

## అంగనవాడీలపై ఎస్మా ప్రయోగం సరికాదు

**తక్షణమే జీవోను రద్దు చేయాలి**

**టీఎన్టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మొకర ఆదిబాబు**



**కృష్ణలంక, మేజర్ న్యూస్ :** అంగనవాడీలపై ఎస్మా ప్రయోగించడాన్ని సరికాదని, తక్షణమే జీవోను రద్దు చేయాలని టీఎన్టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మొకర ఆదిబాబు డిమాండ్ చేస్తున్నట్లు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జీ.వో.నెం 2 ద్వారా రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని మహిళ శిశు సంక్షేమ శాఖ ద్వారా అంగన్ వాడీల సమ్మెను నిషేధిస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని, అంగనవాడీల 25 రోజుల నుండి సమ్మెను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. సమ్మెను పరిష్కరించకుండా రాష్ట్ర ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తున్నదని, అంగనవాడీలు అత్యవసర సర్వీసు అని భావించినప్పుడు, సమ్మెను పరిష్కరించకపోవడానికి రాష్ట్ర ప్రభుత్వానిదేనన్నారు. బాధిత కార్మికులపై ప్రభుత్వం ఎస్మా ప్రయోగించిందని, రాష్ట్రంలోని 1,04,000 మంది ఎస్సీ ఎస్టీ బీసీ ఒంటరి మహిళలపై ఇటువంటి కక్షపూరితమైన నిర్ణయము చేయడం దుర్మార్గమని తెలిపారు. ఇది రాష్ట్ర ప్రభుత్వం నియంత్రత్వ ధోరణికి నిదర్శనం దీన్ని టీఎన్టీయూసీ కార్మిక సంఘం తీవ్రంగా ఖండిస్తున్నామని తెలియజేశారు. అత్యవసర సర్వీసులంటే నీరు, పాలు, విద్యుత్తు, రవాణా లాంటి కీలక సర్వీసులు మాత్రమేనని, అంగన్వాడీలు లబ్ధిదారులకు పంచే పోషక పదార్థాలను అత్యవసర సర్వీసులో చేర్చడం చట్ట వ్యతిరేకమని తెలిపారు. అంగనవాడీలంతా పండగ రోజులతో సహా సమ్మె శిబిరాల్లోనే ఉంటున్నారని, వైయస్సార్ పోషణ పదార్థాలను పంచడం రాష్ట్ర ప్రభుత్వానికి చేతకాక అంగనవాడీలపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని ఆదిబాబు పేర్కొన్నారు. ఈ ఆరోపణలు ఆపాలని, ఎస్మా జీవోని వెంటనే ఉపసంహరించుకోవాలని టీఎన్టీయూసీ కార్మిక సంఘం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నట్లు ఆదిబాబు తెలియజేశారు.

## సీఎం రిలీఫ్ ఫండ్‌తో ఆనందం



**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** సీఎం రిలీఫ్ ఫండ్‌తో ఆనందం పొందుతున్నారని శాసనసభ్యులు సింహాద్రి రమేష్ బాబు అన్నారు. ఆదివారం నియోజకవర్గంలోని అవనిగడ్డ ఘంటశాల మండలంలో ఒకొక్కరికి, చల్లపల్లి మండలంలో ఇరువురికి మొత్తం నలుగురు బాధితులకు 93 లక్షల 5 వేల రూపాయలను రాష్ట్ర ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి వచ్చిన చెక్‌లను ఎం.ఎల్.ఎ సింహాద్రి రమేష్ బాబు తన కార్యాలయంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రమేష్ బాబు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజలను దృష్టిలో పెట్టుకుని ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని, ఆ సంక్షేమ పథకాల్లో భాగంగా ఆరోగ్య శ్రీ కార్డు ద్వారా గతంలో 5 లక్షల రూపాయల వరకు నిధులు మంజూరు చేసేవారని, నేడు 5 లక్షల నుండి 25 లక్షలకు పెంచడం జరిగిందన్నారు. ఆరోగ్య శ్రీ ద్వారా అవకాశం లేని వారికి సి.ఎం సహాయనిధి నుండి నిధులు మంజూరు చేసి బాధితులకు అందించడం వల్ల వారి మోహంలో చిరునవ్వులు చిందుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వర రావు, ఎం.పి.పి తుంగల సుమతీదేవి, జడ్.పి.టి.సి చింతలపూడి లక్ష్మీనారాయణ, మండల కో ఆప్షన్ సభ్యులు షేక్ నజీర్ భాషా, పట్టణ పార్టీ అధ్యక్షులు లంకమ్మ అమ్మవారి ట్రస్ట్ బోర్డు చైర్మన్ అన్నపరెడ్డి రామదాసు, మార్కెట్ యార్డ్ చైర్మన్ వేమూరి వెంకట్రామ్, పాత ఎడ్లంక మాజీ సర్పంచ్ సైకం బాబురావులతో పాటు పలువురు పాల్గొని చెక్‌లను పంపిణీ చేశారు.

# గుడ్లవల్లేరు, గుడివాడ రూరల్‌ల్లో రూ. 4కోట్లతో బీటీ రోడ్ల నిర్మాణాలు



**గుడివాడ, మేజర్ న్యూస్:** గుడివాడ, గుడ్లవల్లేరు మండలాల్లో రూ. 4కోట్ల ప్రభుత్వ నిధులతో దశల వారీగా బీటీ రోడ్లు నిర్మాణానికి అధికారులు, వైసీపీ నాయకులు ఆదివారం శంఖుస్థాపన చేశారు. గుడ్లవల్లేరు మండలం అంగలూరు చెరువు వరకు కుచ్చికాయలపూడి-విన్నకోట రోడ్డును వేస్తున్నట్టు ఆర్ అండ్బీ డి.ఇ కామేశ్వరరావు తెలియజేశారు. అలాగే గుడివాడ రూరల్, గుడ్లవల్లేరు మండలాల్లో పాడైన మరో 3రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే కొడాలి నాని కృషితో మొత్తం రూ. 4 కోట్ల నిధులు మంజూరయ్యాయన్నారు. తొలివిడతగా పాత మల్లయ్య పాలెం నుండి మోటూరు వరకు రూ.1.2 కోట్లతో 2.2 కిలో మీటర్ల రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయని చెప్పారు. రెండో విడతగా



కుచ్చికాయలపూడి -విన్నకోట రోడ్డుకు పోలిమెట్ల నుండి అంగులూరు చెరువు వరకు రెండు కోట్ల నిధులతో 4.4 కిలోమీటర్ల వరకు బీటీ రోడ్డు నిర్మాణ పనులను నేడు ప్రారంభమయ్యాయన్నారు. జేమ్స్ పేట-చిన్నగొన్నూరు రోడ్డుకు కట్లవానిపాలెం వరకు 80 లక్షల నిధులతో 2.2 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణ పనులు అతి త్వరలో ప్రారంభమవుతాయని డి.ఈ కామేశ్వరరావు తెలియజేశారు. గుడివాడ నియోజకవర్గంలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు జరుగుతున్న కళ్ళు మూసుకున్న ప్రతిపక్షాలు నీచ రాజకీయాలు చేస్తున్నారని వైసీపీ నేతలు ఈ సందర్భంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే కొడాలి నాయకత్వంలో చరిత్రలో నిలిచిపోయేలా గుడివాడలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని గుడ్లవల్లేరు మండల నాయకులు పేర్కొన్నారు. రోడ్డు నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమంలో ఎంపీపీ కొడాలి సురేష్, మాజీ ఎంపీపీ కోగంటి ధనుంజయ, సర్పంచ్ లు కొత్తూరి లక్ష్మీనారాయణ, అడుసుమిల్లి సత్యనారాయణ, కోటప్రోలు నాగు, మండల యూత్ అధ్యక్షుడు గుదేరవి, పార్టీ నాయకులు పిన్నమనేని రాఘవేంద్ర, అల్లూరి ఆంజనేయులు, కొడాలి శివ, ఆర్ అండ్ బి ఈ.ఈ శ్రీనివాసరావు, వర్క్ ఇన్స్ స్పెక్టర్ రామస్వామి, పలువురు ప్రజా ప్రతినిధులు, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

# ఎంఏ ఖాజ కుటుంబ సభ్యులకు నేతలు పరామర్శ



ఎంఏ ఖాజ కుటుంబ సభ్యులను తంగిరాల సౌమ్య పరామర్శ

**నందిగామ, జనవరి 7, మేజర్ న్యూస్:** పట్టణం లోని నేటి దినపత్రిక సూర్య స్టాఫ్ రిపోర్టర్, మాజీ మున్సిపల్ కో అప్టేట్ కౌన్సిలర్ ఎంఏ ఖాజా తల్లి జమీలున్ ఫాతేహా సంస్కరణ కార్యక్రమం శనివారం రాత్రి నిర్వహించారు. నేతాజీ నగర్ లోని వారి స్వగృహానికి మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య టిడిపి శ్రేణులతో కలిసి ఖాజా కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి విశ్రాంతి తీసుకుంటున్న ఖాజా సోదరుని కుమారుడు అసిస్టెంట్ మేనేజర్ అబ్దుల్ హలీంని పరామర్శించిన నాని అతని ఆరోగ్య పరిస్థితులు తెలుసుకొని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో వివిధ హోదాలో ఉన్న తెలుగుదేశం పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఎంఏ ఖాజ కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు పరామర్శ

**నందిగామ, జనవరి 7, మేజర్ న్యూస్:** పట్టణం లోని నేటి దినపత్రిక సూర్య స్టాఫ్ రిపోర్టర్, మాజీ మున్సిపల్ కో అప్టేట్ కౌన్సిలర్ ఎంఏ ఖాజా తల్లి జమీలున్ ఫాతేహా సంస్కరణ కార్యక్రమం శనివారం రాత్రి నిర్వహించారు. నేతాజీ నగర్‌లోని వారి స్వగృహానికి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్మోహన రావు, ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్ టిడిపి శ్రేణులతో కలిసి ఖాజా కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి విశ్రాంతి తీసుకుంటున్న ఖాజా సోదరుని కుమారుడు అసిస్టెంట్ మేనేజర్ అబ్దుల్ హలీంని పరామర్శించిన నాని అతని ఆరోగ్య పరిస్థితులు తెలుసుకొని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో వివిధ హోదాలో ఉన్న వైసీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# వీకెఆర్ పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



**గన్నవరం, జనవరి 7, మేజర్ న్యూస్ :** కేసరపల్లి గ్రామంలోని వికెఆర్ కళాశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం అపూర్వంగా.. పండుగలా ఆదివారం జరిగింది. తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పూర్వ విద్యార్థులు.. స్నేహమేరా జీవితం.. వికెఆర్ కుటుంబం శాశ్వతం.. అంటూ తమలోని ప్రేమను చాటుకున్నారు. మన కలయిక అపూర్వం.. అంటూ నాటి తీపి జ్ఞాపకాలను నెమర వేసుకున్నారు. ఇంకా చెప్పాలంటే ఆప్యాయత పలకరింపులు.. నాటి చిలిపి పనులతో పులకరింపులు.. జోకులతో కేరింతలు.. జీవితంలో సాధించిన విజయాలను పంచుకుని ఆ పాత మిత్రుల కలయికతో, ఎంతో ఆనందంగా నాటి అధ్యాపకులతో కలసి ఆత్మీయ సమ్మేళనం పండుగలా జరిపారు. ఇతర దేశాల నుండి వచ్చిన విద్యార్థులతో పాటు ఇతర రాష్ట్రాలు, ముఖ్య పట్టణాలలో నుంచి, గ్రామీణ ప్రాంతాల నుంచి 1962 నుంచి 2022 వరకు విద్యార్థులందరూ ఒకే చోట కలిసి పండుగ వాతావరణాన్ని మైమరపించేలా సందడి చేశారు. సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు బ్యాచ్ ల వారీగా కలిసి వారి అనుభవాలు, కాలేజీతో వారికున్న అనుబంధాలు నెమరు వేసుకుంటూ ఎంతో ఆనందంగా, ఉల్లాసంగా గడిపారు. ఈ విధంగా ప్రతి నూతన సంవత్సరం మొదటి ఆదివారం కలుసుకునేలా చేసిన కళాశాల పూర్వ విద్యార్థుల కమిటీ సభ్యులకు ప్రతి ఒక్కరు ధన్యవాదాలు తెలియజేశారు. ముందుగా వేములపల్లి కోదండరామయ్య, లక్ష్మీ అన్నపూర్ణమ్మ దంపతులు, తొలి ప్రిన్సిపాల్ తాతినేని శ్రీనివాస రావు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పూర్వ విద్యార్థుల కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు మూల్పూరి వెంకట లక్ష్మీప్రసాద్, నాదెండ్ల బాలమురళీకష్ణ లు స్వాగతోపన్యాసం చేశారు. కళాశాల మాజీ ప్రిన్సిపాల్ డాక్టర్. వి.స్వర్ణకుమారి, రిటైర్డు అధ్యాపకులు మద్దుకూరి విజయకుమార్, డిఎస్. సుబ్బారావు, గన్నె వెంకట్రావు, గాంధీ బాబు మాట్లాడుతూ వికెఆర్ కుటుంబంలో సభ్యులు కావడం వల్లే ఎంతో ఆనందంగా, ఆరోగ్యంతో హాయిగా జీవనం సాగిస్తున్నామని చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్ డి.శ్రీనివాసరావు విద్యార్థుల అభ్యున్నతికి చేస్తున్న కృషిని వివరించారు. పేద విద్యార్థులకు కావలసిన అవసరాలను తెలియజేశారు. పూర్వ విద్యార్థుల కమిటీ గౌరవాధ్యక్షులు టి ఎస్ ఆర్ కె ప్రసాద్ మాట్లాడుతూ 2024 నుంచి వీకేఆర్ కళాశాలలో చదివే పేద విద్యార్థులకు యూనిఫామ్‌ను తానే అందిస్తానని ప్రకటించారు. పూర్వ విద్యార్థుల కమిటీ అధ్యక్షులు ఎంవిఎల్ ప్రసాద్ మాట్లాడుతూ.. కళాశాలలో గ్రంథాలయం అభివృద్ధి, బాగా చదువుతున్న విద్యార్థులకు ఆర్థిక చేయూత, పేద విద్యార్థులకు కళాశాల ఫీజులు చెల్లింపు వంటి కార్యక్రమాలకు పూర్వ విద్యార్థుల కమిటీ పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని ప్రకటించారు. కళాశాల అభివృద్ధికి యాజమాన్యం కమిటీ అధ్యక్షులు వెంకట్ మోటపర్తి, కార్యదర్శి జి ఎల్ ఎస్ ఎన్ ప్రసాద్ లు చేస్తున్న కృషిని ప్రశంసించారు. పూర్వ విద్యార్థుల కమిటీ కోశాధికారి రాంబాబు, సభ్యులు కొత్తంగి శ్రీనివాసరావు సమన్వయకర్తగా వ్యవహరించారు. నాటి అధ్యాపకులను సముచితంగా గౌరవించారు. ఆత్మీయ విందు ఇచ్చారు.

# మోడీ పాలనలో హిందువులకు కలిగిన ప్రయోజనం ఏమీ లేదు



గుంటూరు మేజర్ న్యూస్: ఆదివారం ఉదయం 11 గంటలకు స్థానిక అరండల్ పేటలోని ఎస్సీ,ఎస్టీ రైల్వే ఎంప్లాయిస్ అసోసియేషన్ హాలునందు ముస్లిం యునైటెడ్ ఫ్రంట్ మరియు ముస్లిం జేఏసీ ఆధ్వర్యంలో మతతత్వ విధానాలతో ఎన్నికలకు సిద్ధ మవుతున్న మోడీ సర్కార్-ప్రజా సంఘాల బాధ్యత అనే అంశంపై ఎస్సీ, ఎస్టీ ,బీసీ, మైనార్టీ ప్రజాసం ఘాల నాయకుల సమావేశము ముస్లిం హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు షేక్ ఖాజావలి అధ్యక్షతన జరిగినది, సమావేశమునకు ప్రధాన వక్తగా విచ్చేసిన ముస్లిం యునైటెడ్ ఫ్రంట్, ముస్లిం జేఏసీ అధ్యక్షులు మహమ్మద్ కలీం మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్నటువంటి శ్రీ నరేంద్ర మోడీ ప్రభుత్వం తన తొమ్మిదిన్నర సంవత్సరాల కాలంలో చేసిన అభివృద్ధి ఏమీ లేక తిరిగి రానున్న ఎన్నికల్లో మతపరమైన వివాదాస్పద అంశాలను మళ్లీ తెరమీదికి తెచ్చి ఎన్నికలకు సిద్ధపడుతుందని ఆయన ఆరోపించారు. సంపూర్ణ మెజారిటీతో భారత దేశ ప్రజలు రెండుసార్లు మోడీ ప్రభుత్వానికి అవకాశమిచ్చిన చేసిన అభివృద్ధి ఏమీ లేక రామ మందిర నిర్మాణం, ఆర్టికల్ 370 రద్దు, త్రిపుల్ తలాక్ రద్దు, లాంటి తాము చేసిన ఘనకా ర్యాలు గా చూపుతూ, రానున్న ఎన్నికల్లో ఉమ్మడి పౌరస్మృతి . వక్ఫ్ చట్టం రద్దు లాంటి వివాదాస్పద అంశాల ను మరల తెరమీదకి తెచ్చేందు కు ప్రయత్నిస్తుందని, ఇటువంటి అంశాల వల్ల విద్వేషాలను రేపి తద్వారా రాజకీయ లబ్ధిపొంద దం కోసం చేస్తున్న ప్రయత్నాన్ని లౌకికవాద శక్తులందరూ కలిసి తిప్పి కొట్టాలని ఆయన ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ ప్రజాసంఘాల నాయకులను కోరారు. గత తొమ్మిదిన్నర సంవత్సరాలు గా కాలయాపన చేస్తూ వీరు చేసిన కార్యాల వల్ల ముస్లిం సమాజానికి జరిగిన కీడు లేదు, హిందూ సమాజానికి కలిగిన ప్రయోజనం ఏమీ లేదని ఆయన తెలిపారు. సమావేశానికి అధ్యక్షత వహించిన షేక్ ఖాజావలి మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో రామ మందిరం నిర్మాణమే తమ ప్రచార అస్త్రం అని కేంద్ర ప్రభుత్వం ప్రకటనలు ఇవ్వడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని, ప్రభు త్వం అనేది ప్రజలందరిది, ఒక మతానికొ ,ఒక కులానికో ఒక వర్గానికో చెందింది కాదని, అన్ని వర్గాల ప్రజల క్షేమమే ప్రభుత్వ బాధ్యత అని అయితే ఇందుకు విరుద్ధంగా ప్రధానమంత్రి మరియు ఆయన సహచర మంత్రివర్గ సభ్యులు ఒక వర్గం వారికే ప్రతినిధులుగా వ్యవహరించటం లౌకిక తత్వానికి ప్రమాదకరమని అన్నారు. బహుజ న మహాసభ నాయకులు జీఆర్ భగత్ సింగ్ మాట్లా డుతూ రామ మందిరం నిర్మాణం కు సంబంధించి మందిర ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించవలసిన విగ్రహ ప్రాణ ప్రతిష్ట కార్యక్రమంలో కేంద్ర ప్రభు త్వం అన్నీ తానై నిర్వహించటం దేనికి సంకేతం అని ఆయన ప్రశ్నించారు. బీసీ నాయకులు తాడి కొండ నరసింహారావు మాట్లాడుతూ మతతత్వ విధానాలకు హిందూ సమాజం విరుద్ధమని రాజకీ యాల కోసం మతాన్ని వాడుకోవటాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ఎస్టీ నాయకులు చంద్ర నాయక్ మాట్లాడుతూ రాజ్యాంగాన్ని తొల గించి మనువాదం కొనసాగించాలని చేస్తున్న ప్రయ త్నాలను అన్ని వర్గాల వరకు కలిసి ఎదుర్కొనేం దుకు అందరూ సిద్ధంగా ఉండాలని కోరారు. భారత్ బచావో నాయకులు కోలా నవ జ్యోతి మాట్లాడుతూ మతతత్వ శక్తులను ఎదుర్కొనేందుకు అల్ప, బడుగు, బలహీనవర్గాల సంఘాలన్నీ ఐకమ త్యంతో పనిచేయాలని కోరారు.సమావేశం అనంత రం ముస్లిం యునైటెడ్ ఫ్రంట్, ముస్లిం జేఏసీ అధ్య క్షులు ఎండి కలీం ముద్రించిన "మోడీ పాలనలో హిందువులకు కలిగిన ప్రయోజనం ఏమీ లేదు" అనే కరపత్రాన్ని సమావేశంలో పాల్గొన్న సంఘాల నాయకులు ఆవిష్కరించారు. ఈ సమావేశంలో నల్లపు నీలాంబరం,పాస్టర్ ముత్తయ్య, నాదెండ్ల బ్రహ్మయ్య, బషీర్ అహ్మద్, మీర్జా హిదాయతుల్లా బేగ్, సూఫీ ఇమ్రాన్ ఆదం సాహెబ్, సైదా సాహెబ్, షేక్ మీరావలి, డాక్టర్ యూనుస్, ప్రకాష్ రావు, ముస్లిం యునైటెడ్ ఫ్రంట్ నాయకులు మెమన్ భాష ,జాఫర్, జాకీర్, రబ్బాని లతోపాటు తదితర ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# కెఎల్ యులో ఘనంగా ప్రారంభమయిన యువజనోత్సవాలు

తాడేపల్లి మేజర్ న్యూస్ : రాష్ట్ర స్థాయి యువజన ఉత్సవాలు స్థానిక కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీలో ఆదివారం నాడు ఘనంగా ప్రారంభమయ్యాయి యువజన సర్వీసుల ముఖ్య కార్యదర్శి ప్రద్యుమ్న ఐఏఎస్, కెఎల్ యు రిజిస్ట్రార్ డాక్టర్ కే సుబ్బా రావులు ముఖ్యఅతిథులుగా పాల్గొని యువజన ఉత్సవాలను లాంఛనంగా ప్రారంభించారు ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూ భారత యువతకు సరైన దిశా నిర్దేశం చేయడానికి స్వామి వివేకానంద లాంటి ఆధ్యాత్మిక గురువులు అవసరమన్నారు యువతను పెడదారులు పట్టనీయకుండా తల్లిదం డ్రులతో పాటు గురువులు కూడా బాధ్యతలు తీసు కోవడం అవసరమన్నారు రాష్ట్రస్థాయిలో జరుగు తున్న యువజన ఉత్సవాలలో రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన యువ బృందాలు వివిధ రకాలైన సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించడం సంతో షకరమన్నారు ఈ యువజన ఉత్సవాలలో కేవలం యువతకు పోటీలు నిర్వహించడమే కాకుండా యువత కేవలం ఉద్యోగాలుగా కాకుండా ఉద్యో గాలను ఇచ్చే వారిగా ఆ స్థాయికి ఎదగాలని ఆయ న కోరారు. మనకు ముందున్నతరం గొప్పవారని పిల్లలకు చెప్పాలని స్వామి వివేకానంద సూచించి నట్లుగా ఆయన తెలిపారు మనకు ముందున్న తరం గొప్పవారు అనే విషయం తెలుసుకున్న పిల్ల లు మాత్రమే గొప్పవారు అవుతారని ఆయన అభిప్రాయపడ్డారు ఈ సందర్భంగా రాష్ట్ర యువజన సర్వీసుల శాఖ కమిషనర్ కే శారద దేవి



ఐఏఎస్ మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో అత్యంత ప్రతిభ కనబరిచిన ఆయా యువతి యువకులను ఈనెల 10న ప్రత్యేక బస్సుల ద్వారా మహారాష్ట్ర లోని నాసిక్‌లో జరిగే జాతీయ యువజన ఉత్సవా లకు తరలిస్తామని తెలియజేశారు నాసిక్ లో జరిగే యువజన ఉత్సవాలకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆసక్తి కలిగిన యువతీ యువకులు కూడా పాల్గొనవ చ్చునని ఆమె సూచించారు. జిజ్ఞాస ఫౌండేషన్ డైరెక్టర్ భార్గవ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మక నిర్వహిస్తున్న యువజన ఉత్సవాలు కేఎల్యులో అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి అన్నారు ఈ సందర్భంగా యువ తీ యువకులకు పోటీలతో పాటు సమ్మిట్లను యువతి యువకుల అవగాహన సదస్సులను నిర్వహిస్తున్నామన్నారు వీటి ద్వారాగా యువతీ యువకులు రానున్న కాలంలో స్టార్టప్‌లుగా పారిశ్రామికవేత్తలుగా ఎదిగి అనేకమందికి ఉద్యో గాలను ఇచ్చే స్థాయికి ఎదగడమే లక్ష్యంగా ఆం ధ్రప్రదేశ్ ప్రభుత్వం యువజన సర్వీసుల శాఖ పని చేస్తుందన్నారు జిజ్ఞాస ఫౌండేషన్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంయుక్తంగా నిర్వహి స్తున్న యువజన సర్వీసులు యువ జన ఉత్సవాలకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి అత్యంత ప్రతి భావంతులైన యువతీ యువకులు ఆయా కలవ యందు నైపుణ్యం కలిగిన వారు పెద్ద సంఖ్యలో పాల్గొ న్నారు అని తెలియజేశారు అన్ని రకముల వసతులు కలిగిన కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీలో తమకు ఈ సదస్సులను యువజనోత్సవాలను నిర్వహించుకోవ డానికి అవకాశాన్ని కల్పించినందుకు కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ యాజమాన్యానికి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువజన సర్వీసుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎస్వీ ఎస్.రామ కృష్ణ, అసిస్టెంట్ డైరెక్టర్ స్వామి, వర్సిటీ వైస్ ఛాన్సర్ డాక్టర్ జి పార్థసారధి వర్మ ప్రో వైస్ ఛాన్సర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్ వెంకట్రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కే సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ సిహెచ్. హనుమంతరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ కే.సుబ్రహ్మ ణ్యం తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయాల కోసమే తెరపైకి వైఎస్ మరణం - కాంగ్రెస్ నేత షేక్ మస్తాన్ వలీ

గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో : వైఎస్ షర్మిలను విమర్శించే అర్హత వైకాపా ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డికి లేదని పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్ వలీ మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీలో షర్మిల చేరడంతో వైకాపా నేతలకు భయం పట్టుకుందని ఆరోపించారు. గుంటూరులో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. "వైఎస్ రాజశేఖర్ రెడ్డి కుటుంబమంతా కాంగ్రెస్‌కు సేవలందించింది. ఒక్క జగన్ మాత్రమే ఆ పార్టీని వీడారు. ఇందిరమ్మ ఆశయ సాధనకు రాజశేఖర్ రెడ్డి కృషి చేశారు. తండ్రి కలలను నిజం చేసేందుకే షర్మిల కాంగ్రెస్‌లోకి వచ్చారు. వైకాపా నచ్చకే పార్టీకి ఆమె దూరమయ్యారు. రాజశేఖర్ రెడ్డి మరణంపై అనుమానాలు ఉంటే సజ్జల ఈ ఐదేళ్ల అధికారంలో ఉండి ఏం చేశారు? ఆయన మృతిపై విచారణకు ఎందుకు డిమాండ్ చేయలేదు? కేవలం రాజకీయాల కోసమే వైఎస్ మృతిని మళ్లీ తెరపైకి తెచ్చారు. వివేకా హత్య కేసు నిందితులను ఎందుకు పట్టుకోలేదు? ప్రధాని మోదీకి సీఎం జగన్ పూర్తిగా లొంగిపోయారు. రాష్ట్రాన్ని ఆయన వద్ద తాకట్టుపెట్టారు" అని విమర్శించారు.

# రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



గుంటూరు క్రైం, మేజర్ న్యూస్: వేగంగా వెలుతున్న ద్విచక్రవాహ నం తప్పి రైలింగ్ను ఢీ కొట్టిన సంఘటనలో దండిపోయిన ప్రసాద్ అనే వ్యక్తి జాతీయ రహదారిపై మృతి చెందాడు. గుంటూరు కాకా ని రోడ్డు బసవతారక రామనగర్ చెందిన ఇతను ద్విచక్ర వాహనంపై చిలకలూరిపేట వైపు నుంచి విజయవాడ వైపుకు వెళుతున్నాడు. లాలుపురం సమీపంలో బైక్ వేగం అదుపుతప్పి ఇనుప రైలింగ్ ను ఢీకొన్నాడు. తీవ్రగాయాలు కావడంతో అక్కడే మృతి చెందాడు. నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్విగ్ర ఆవిష్కరణ విజయవంతం చేద్దాం



గుంటూరు సిటీ మేజర్ న్యూస్ : వైఎస్ఆర్సిపి పార్టీ కార్యాలయంలో జరిగిన భారత రాజ్యాంగ నిర్మాత" డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 125 అడుగుల కాంశ్య విగ్రహ ఆవిష్కరణ సన్నాహ సభ " లో మాట్లాడుతున్న గుంటూరు జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ మంత్రివర్యులు డొక్కా మాణిక్య వరప్రసాద్ గుంటూరు తూర్పు నియోజకవర్గం సమన్వయకర్త నూరి ఫాతిమా వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ గారు, డిప్యూటీ మేయర్ డైమండ్ బాబు పొన్నూరు నియోజకవర్గ పరిశీలకులు అన్నా బత్తినసదాశివరావు, గుత్తికొండ అంజి రెడ్డి, రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ మంద పాటి శేషగిరిరావు, గుంటూరు జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు పెరికల కృష్ణమో హన్ డాక్టర్ సెల్ అధ్యక్షులు వైషేక్ గారు, లీగల్ అధ్యక్షులు సిడి భగవాన్, రాష్ట్ర వైసీపీ నాయకులు అత్తోట జోసఫ రాష్ట్ర రోడ్డు రవాణా కార్పొరేషన్ డైరెక్టర్ పిల్లి మేరీ, నగర మహిళా అధ్యక్షురాలు గనిక ఝాన్సీ, రత్న కుమారి ఎం జె ఎస్ నాయకులు మరియు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# వేగంగా టిడ్కో ఇళ్ల పట్టాల పంపిణీ



గుంటూరు, మేజర్ న్యూస్ : టిడ్కో ఇళ్ల పట్టాల పంపిణీ వేగంగా జరుగుతుం దని, జిల్లా కలెక్టర్, నగర కమిషనర్ ఆదేశాల మేరకు ఈ నెల 12 నాటికి పూర్తి స్థాయిలో అందరికీ పట్టాలు అందిస్తామని టిడ్కో ఎస్.ఈ. చిన్న కోటేశ్వ రరావు అన్నారు. ఆదివారం అడవితక్కె ళ్లపాడులోని టిడ్కో గృహ సముదా యంలో 10 బ్లాక్ ల్లో లబ్దిదారులకు పట్టాలు, ఫ్లాట్ తాళాలు అందించారు. ఈ సందర్భంగా ఎస్.ఈ. మాట్లాడు తూ గుంటూరు అర్బన్ పరిధిలోని టిడ్కో గృహ సముదాయాలను శనివారం ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు ప్రారం భించారని, లబ్దిదారులకు పట్టాలను రోజువారీ షెడ్యూల్ మేరకు పంపిణీ చేయ డం జరుగుతుందన్నారు. అడవితక్కెళ్లపాడులోని 101 బ్లాక్ లకు సంబంధించి 300 చదరపు అడుగుల ప్లాట్ లు ఆదివారం 10 బ్లాక్ ల లబ్దిదారులకు పట్టాలు అందించామని, ఈ నెల 12 నాటికి పట్టాల పంపిణీ పూర్తి అవుతుందని తెలిపారు. మంగళవారం నుండి 365, 425 చదరపు అడుగుల ప్లాట్ లను బ్లాక్ ల వారీగా క్రమ పద్దతిలో అప్పగించడం చేస్తామన్నారు. పట్టాలు పొందిన లబ్దిదారులు తగిన వివరాలతో విద్యుత్ మీటర్ కోసం దరఖాస్తు చేసుకుంటే వేగంగా ఇవ్వడానికి ఆ శాఖ చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. టిడ్కో ఇళ్లు మంజూరై, పట్టా రాని వారు అడవితక్కెళ్లపాడులోని టిడ్కో గృహ సముదాయంలో జిఎంసి, టిడ్కో అధికారులు అందుబాటులో ఉంటారని, వారిని కలిసి వివరాలు తెలుసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ బి.శ్రీనివా సరావు, టిడ్కో ఎస్.ఈ. చిన్న కోటేశ్వరరావు, ఈ.ఈ. ప్రసాద్, జిఎంసి మేనేజర్ శివన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఏపీఎస్ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల మహాసభ



పొన్నూరు మేజర్ న్యూస్ : ఏపీఎస్ ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల మహాసభ స్థానిక వెంకట సీతారామ కళ్యాణ మండపం ఆర్ టి సి డిపో వద్ద జరిగినది. మహాసభ కు విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు పి కోటేశ్వరరావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి సుబ్బయ్య మాట్లాడుతూ సుప్రీం కోర్టు తీర్పు ప్రకారము విశ్రాంత ఉద్యోగులకు మినిమం పెన్షన్ అమలు చేయాలని కోరారు. రీజనల్ అడ్వైజర్ రావిపాటి ఆంజనేయులు మాట్లాడుతూ ఈ పి ఎఫ్ ఓ నిబంధనల ప్రకారమే 1.9.2014 తరువాత ఉద్యోగం విరమణ పొందిన వారికి ఇచ్చేటి హయ్యర్ ఆప్షన్ ఏ రూపం ఇచ్చిన అది కాలయాపన చేయకుండా వెంటనే ఇవ్వాలని మరియు సామాజిక పెన్షన్ పొందే వారి కంటే తక్కువ పెన్షన్ పొందుతున్న ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇటీవల దేశ రాజధాని ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద జరిగిన ఉద్యమాన్ని మరియు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. రీజియన్ నాయకులు పూర్ణచంద్రరావు, బాపట్ల నుండి వచ్చిన విశ్రాంత ఉద్యోగుల నాయకులు వెంకటేశ్వరరావు, ఏ వీ కే ప్రసాద్, విశ్రాంత ఉద్యోగుల సంఘం పొన్నూరు డిపో సెక్రటరీ రజాక్, కె తిరుపతిరావు, కె.వి రమణారావు, ఎం జగపతిరావు,దీ మురళి తదితరులు మాట్లాడారు. విశ్రాంత ఉద్యోగులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించాలని మినిమం పెన్షన్ను అమలు చేయాలని తీర్మానించారు.

## యువత భవిష్యత్ కి బాబు గ్యారెంటీ



గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో : వైసీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుండి కక్ష రాజకీయాలు, వేధింపులు తప్ప ఈ రాష్ట్ర అభివృద్ధిని గాలికి వదిలేసి, ఉద్యోగాల పేరుతో వాలంటీర్ల ను ఇచ్చి వంచిన చేసిన జగన్ రెడ్డిని గద్దె దించి చంద్రబాబును ముఖ్యమంత్రి చేసుకుంటే యువత భవిష్యత్ కు గ్యారెంటీ దొరుకుతుందని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ ఇంచార్జి కోవెలమూడి రవీంద్ర,సింహాద్రి కనకాచారి తెలిపారు. ఆదివారం గుంటూరు 31వ డివిజన్ లోని ఏటి అగ్రహారం జీరో లైన్ నుండి బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమానికి ఇంచార్జి కోవెలమూడి రవీంద్ర(నానీ) ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కోవెలమూడి రవీంద్ర(నానీ) మాట్లాడుతూ... వైసిపి ప్రభుత్వ హయాంలో వ్యవస్థలన్నీ నాశనం అయ్యాయని,కొత్త పరిశ్రమలు రాకపోగా ఉన్న పరిశ్రమలు వేరే రాష్ట్రాలు కు తరలించారు అని, మళ్లీ ఈ రాష్ట్రం బాగుపడాలన్న యువతకు ఉద్యోగ ఉపాది అవకాశాలు రావాలన్నా చంద్రబాబు నాయుడు లాంటి సమర్ధుడైన నాయకుడిని ముఖ్యమంత్రిగా చేయాలని, మహానాడు వేదికగా చంద్రబాబు నాయుడు గారు విడుదల చేసిన మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు దాసరి రమణ, దాసరి జ్యోతి, షేక్ రఫీ, నాగూర్ బాషా, నాగూర్ వాలి, శ్రీనివాసరావు, గోపి కృష్ణ సూర్యనారాయణ, షేక్ నసిదా తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు మంచి ప్రణాళికతో కష్టపడితే ఏదైనా సాధించవచ్చు - ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు



పెదకాకాని మేజర్ న్యూస్ : నేటి విద్యార్థులకు మంచి సౌకర్యాలు, సదుపాయాలు లభ్యమవుతున్నాయని, కౌండిన్య ఎడ్యుకేషనల్ ట్రస్ట్ వంటి సంస్థలు ఎంతగానో ప్రోత్సహిస్తున్నాయని, విద్యార్థులు మంచి ప్రణాళికతో కష్టపడితే జీవితంలో ఏదైనా సాధించవచ్చునని ఎమ్మెల్సీ కె. ఎస్. లక్ష్మణరావు అన్నారు. ఆదివారం ఉదయం గుంటూరు జిల్లా, పెదకాకాని మండలం, వెనిగండ్ల గ్రామ శివారులో గల కౌండిన్యపురంలోని కౌండిన్య ఐఏఎస్ అకాడమీ భవనంలో కౌండిన్య ఎడ్యుకేషన్ ట్రస్ట్ స్కాలర్ షిప్స్ ప్రధానోత్సవ సభలో కె .ఎస్ .లక్ష్మణరావు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. సభకు ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ ఇ వి నారాయణ అధ్యక్షత వహించారు.కేఎస్ లక్ష్మణ్ రావు ప్రసంగాన్ని కొనసాగిస్తూ అధ్యాపక ఉద్యమాలలో అత్యంత కీలకపాత్ర పోషించిన డాక్టర్ ఇ వి.నారాయణ ప్రిన్సిపల్‌గా పదవీ విరమణ తర్వాత ఇంతటి బృహత్తర కార్యక్రమం చేపట్టడం ఎంతో సంతోషకరమన్నారు. ఏ వ్యక్తి అయినా జీవితంలో మంచి మార్పుకు విద్య ఒకటే మార్గమని దాని ద్వారానే దేనినైనా సాధించవచ్చునని విశ్వసించే ఆయన విద్యారంగంలో ఒక ఋషిగా గా మారారు అన్నారు. విద్య సమాజంలో మార్పుకు మూల ఆయుధమని, ఆ ఆయుధంతో కుటుంబ పరంగానే గాక సమాజాన్ని ఎంతో ప్రభావితం చేయవచ్చును అన్నారు. వ్యవస్థను పూర్తిగా మార్చవచ్చునన్నారు. స్కాలర్ షిప్ పొందిన విద్యార్థులు చదువుకొని ఉన్నత పదవులు అందుకోవాలని లక్ష్మణరావు ఆకాంక్షించారు. సభలో పాల్గొన్న కమర్షియల్ టాక్స్ విశ్రాంత అద నపు కమిషనర్ వై సత్యనారాయణ మాట్లాడుతూ ఈరోజు ఈ ఐఏఎస్ అకాడమీ భవనం ఎంతోమంది దాతల శ్రమ ,విరాళ ఫలితం అన్నారు. నేటి విద్యార్థులే... రేపటి దేశ భవిష్యత్తు అన్నారు .అన్ని సదుపాలను అంద రికీ ప్రభుత్వం కల్పించలేదని, కౌండిన్య ఐఏఎస్ అకాడమి వంటి సంస్థలు భాగస్వాములు కావాలని అన్నారు. విద్యార్థులు 5 విషయాల ను దృష్టిలో పెట్టుకోవాలన్నారు. ప్రతి ఒక్కరు జీవితంలో విద్యాప రంగా, వృత్తిపరంగా, ఆర్థికపరంగా, వికాసంపరం గా, వితరణ పరంగా ఆలోచన విధానాన్ని మలుచుకోవాలన్నారు. ఈ ఐదు విషయాలపై దృష్టి సారిం చిన వారే ఉన్నత వ్యక్తిత్వంతో అత్యున్నత సమాజాన్ని నిర్మించగలరన్నారు. సభాధ్యక్షులు ఇవి నారాయణ మాట్లాడుతూ కేవలం ఇద్దరితో ప్రారంభమైన స్కాలర్ షిప్స్ నేటికీ 6000 మందికి ఇచ్చే స్థాయికి ఎదిగిందన్నారు. ఈరోజుకి ఇప్పటివరకు ఒక కోటి 90 లక్షల రూపాయలు స్కాలర్ షిప్ గా ఇవ్వటం జరుగుతుందని ,దీనికి మూలధనం రెండు కోట్లకు పైగా ఫిక్స్ డ్ డిపాజిట్ రూపంలో ఉందన్నారు .ఎంతోమంది దాతల సహకారంతోనే ఇవన్నీ సాధించగలగామన్నారు. చదువు మాత్రమే చాలదని భావించిన మేము విద్యార్థులు మంచి స్థితిలో స్థిరపడాలని లక్ష్యంతో పోటీపరీక్షలకు శిక్షణ ఇచ్చేందుకు కౌండిన్య ఐఏఎస్ అకాడమీ ప్రారంభించామన్నారు. యువత ఈ సదుపాయాలను వినియోగించుకొని ఉన్నత స్థితికి ఎదగాలని కోరారు. కౌండిన్య ఐఏఎస్ అకాడమీ ద్వారా ఇప్పటికే గ్రూపు 2 పరీక్షలకు శిక్షణ ఇవ్వటం జరుగుతుందన్నారు. సభలో పాల్గొన్న టొబాకో బోర్డ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అద్దంకి శ్రీధర్ బాబు ప్రసంగిస్తూ స్కాలర్ షిప్ ఇచ్చేది ఎంత అన్నది ముఖ్యం కాదని అందులో ప్రతిరూపి ఎంతో విలువైనది అన్నారు. ప్రతి పేదల పేద విద్యార్థులను ప్రోత్సహించడంలో కౌండిన్య ఎడ్యుకేషన్ ట్రస్ట్ సేవలు ప్రశంసనీయమన్నారు. సోషల్ మీడియా, సెల్ ,టీవీ వంటి వాటికి సమయం వృధా చేసుకోకుండా మంచి లక్ష్యం వైపు దృష్టిసారించితే అద్భుత ఫలితాలను సాధించవచ్చునన్నారు. సభలో పాల్గొన్న హెల్త్ సెక్రటరీ డాక్టర్ మంజుల టాటా మాట్లాడుతూ ముగ్గురితో ప్రారంభమైన ఎడ్యుకేషన్ ట్రస్ట్ నేడు వేల మందికి స్కాలర్ షిప్స్ ఇచ్చే స్థాయికి ఎదగడం ఎంతో అభినందనీయమన్నారు. విద్యార్థులకు పోటీ పరీక్షలకు సకల సౌకర్యాలు కల్పించడం ముదా వహ%శీ% అన్నారు. సభలో ప్రతిభ గల పేద విద్యార్థిని విద్యార్థులకు 600 మందికి పైగా స్కాలర్ షిప్స్ చెక్కులను అందజేశారు. సభలో అవినిగడ్డ ప్రగతి ఇన్స్టిట్యూషన్స్ కరస్పాండెంట్ ఎస్ పూర్ణచంద్రరావు, ప్రముఖ ఆడిటర్ నందూరి ఆనందకృష్ణ, విశ్రాంత ప్రిన్సిపల్ డాక్టర్ కే అశోక్ రావు ,పారిశ్రామికవేత్త ఆర్ ప్రసాద్ జడ్పిటిసి సభ్యులు ఆర్ కళ్యాణి తదితరులు మాట్లాడారు. తలుత అతిథులను వాకా రాంగోపాల్ గౌడ్ వేదిక మీదకు ఆహ్వానించగా, వడ్డేంగుంట సుబ్బారావు స్కాలర్ షిప్స్ పొందిన విద్యార్థిని విద్యార్థులకు చెక్కులు పంపిణీ చేయడంలో కీలక పాత్ర పోషించారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు జల్లెడ శ్రీనివాసరావు, బొబ్బిళ్ళ వెంకటేశ్వరరావు ,వీరంకి రంగారావు, పీతా సుబ్బరామయ్య, చిలక చంద్రమౌళి ,బెల్లంకొండ సదాశివ గౌడ్, కారంకి లక్ష్మీనారాయణ, డి సత్యనారాయణ, డాక్టర్ టి సేవ కుమార్ ,డాక్టర్ తాతా సాంబశివరావు అధిక సంఖ్యలో విద్యార్థులు, తల్లిదండ్రులు, గౌడ జన సేవా సమితి ,కౌండిన్య ఎడ్యుకేషన్ ట్రస్ట్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# కార్యకర్తలు కాలర్ ఎగరేసేలా పాలన : మంత్రి విడదల రజిని

గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ప్రతి కార్యకర్త కాలర్ ఎగరేసేలా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పరిపాలన కొనసాగించారని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని తెలిపారు. గుంటూరు 39వ డివిజన్‌లో మూడో రోజు మనతో మన రజినమ్మ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్‌లోని అన్ని ప్రాంతాల్లో మంత్రి పర్యటించారు. గడపగడపకూ వెళ్లారు. ప్రజల నుంచి అపూర్వ స్వాగతం లభించింది. తీన్‌మార్, డీజేల మోతలతో కార్యక్రమం ఉత్సవాన్ని తలపించింది. పూల వర్షంతో ప్రజలు ఆదరాభిమానాలు చాటారు. బాణసంచా పేలుళ్లతో పండుగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజా సంక్షేమం కోసం పరితపించే వ్యక్తి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అని తెలిపారు. సీఎం జగనన్న అనుకుంటనే నథింగ్ ఈజ్ ఇంపాజిబుల్ అని చెప్పారు. వైనాట్ 175 ధీమా వెనకాల నాలుగున్నరేళ్ల సంక్షేమ వెల్లువ ఉందని పేర్కొన్నారు. నిస్వార్థంగా పేదల కోసం పనిచేస్తున్న ఏకైక పార్టీ వైఎస్సార్ కాంగ్రెస్ మాత్రమే అని చెప్పారు. స్వాతంత్ర్యం త్వరాత ఎన్నో ప్రభుత్వాలు వచ్చాయిగాని అంతా పేదల గురించి, సామాజిక న్యాయం గురించి మాటలే తప్ప చేతల్లో చూపలేదని పేర్కొన్నారు. తొలిసారి సామాజిక న్యాయం అనేది నినాదం కాదని, అమలు చేయాల్సిన విధానమని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నిరూపించారని వెల్లడించారు. సీఎం జగనన్న పేదవాడి గుండె చప్పుడుగా నిలబడితే.. చంద్రబాబునాయుడు పెత్తందార్లవైపు నిలబడ్డారని పేర్కొన్నారు. ఈ యుద్ధంలో పేదలు గెలవాలంటే, వారి జీవితాలు బాగుపడాలంటే మన రాష్ట్రానికి మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగనే గెలవాలని చెప్పా రు



దుష్టచతుష్టయానికి బుద్ధి చెప్పాలి వచ్చే ఎన్నికల్లో దుష్టచతుష్టయానికి తగిన విధంగా బుద్ధి చెప్పాలని పేర్కొన్నారు. ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేసి జగనన్నను గెలిపించుకోవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. జగనన్న చేసిన మంచిని గడపగడకూ వెళ్లి ప్రచారం చేయాల్సిన అవసరం మనందరిపై ఉందన్నారు. జగనన్న మళ్లీ అధికారంలోకి వస్తే పేదలకు ఎంతో మేలు జరు గుతుందని చెప్పారు. బడుగు, బలహీనవర్గాల్లో మనో ధైర్యాన్ని నింపిన నాయకుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అని తెలిపారు. గుంటూరు నగరం అభివృద్ధి దిశగా సాగుతోందని చెప్పారు. మళ్లీ అధికారం ఇస్తే మరింతగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. శాసనమండలి విప్ లేళ్ల అప్పిరెడ్డి తదిత రులు మాట్లాడారు. కార్యక్రమంలో డివిజన్ కార్పొరేంట్ మార్కెట్ బాబుతోపాటు ఆయా డివిజన్ల కార్పొరేటర్లు, అధ్యక్షులు, జేసీఎస్ కన్వీనర్లు, మండల జేసీఎస్ అధ్యక్షులు పాల్గొన్నారు.

# ఏపీలో ప్రగతి వెలుగులు

గుంటూరు, మేజర్ న్యూస్ : జీఎస్టీలో అద్భుత వసూళ్లు ఏపీలో ఏమీ జరగడంలేదు అంటూ జరుగుతున్న ప్రచారానికి సరైన జవాబు అన్నట్లుగా ఏకంగా కేంద్రమే ఏపీ ప్రగతి దారులు ఏమిటో స్పష్టంగా చెప్పేసింది. ఆంధ్రప్రదేశ్ లో పాలన గురించి బయట వారు చెబితేనే అర్థం చేసుకోవాల్సి వస్తోంది. ఎందుకంటే నిర్మాణాత్మకమైన ప్రతిపక్షం అయితే లేదు. మంచిని మంచిగా చూసి చెప్పే విశాలత్వం రాజకీయాల్లో కనిపించడంలేదు. ఏపీలో ఏమీ జరగడంలేదు అంటూ జరుగుతున్న ప్రచారానికి సరైన జవాబు అన్నట్లుగా ఏకంగా కేంద్రమే ఏపీ ప్రగతి దారులు ఏమిటో స్పష్టంగా చెప్పేసింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అన్ని విధాలుగా అగ్రగామిగా మారింది అంటూ కేంద్రమే ప్రకటించడం విశేషం. ఏపీ ఉత్పత్తి, వ్యవసాయం, పారిశ్రామిక, సేవా రంగాల్లో అద్భుతమైన వృద్ధిని సాధించింది అని నివేదికలు గణాంకాలు ఎప్పటికపుడు తెలియచేస్తున్నాయి. ఇక చూస్తే ఆంధ్రప్రదేశ్ జీఎస్టీ వసూళ్ళలో 12 శాతం వృద్ధి నమోదైందని కేంద్రం తాజాగా వివరించింది. అలాగే ఈ ఏడాది అంటే 2023 ఏప్రిల్ - సెప్టెంబర్ మధ్య 5 వేల 19 కోట్ల రూపాయలు వసూలైనట్లుగా పేర్కొనడం నిజంగా శుభ పరిణామంగా పేర్కొంటున్నారు. ఈ విషయాన్నికి ఎవరో చెప్పడం కాదు, సాక్షాత్తూ కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారాం ఈ అంశాన్ని వెల్లడించారు. ఏపీ వివిధ రంగాలలో ప్రగతి సాధించింది అన్నది కూడా గణాంకాల ద్వారా రుజువు అయింది. ఏపీలో వివిధ రంగాల అభివృద్ధిని చూసినట్లు అయితే వాహన రంగంతో పాటు, సిమెంట్, బ్యాటరీ పరిశ్రమల రంగం కూడా మంచి పురోగతి సాధించడం వల్లనే అతి పెద్ద మొత్తాలలో జీఎస్టీ వసూలు అయినట్లుగా వాణిజ్య వర్గాలకు చెందిన గణాంకాలు తెలియచేస్తున్నాయి. ఇవన్నీ ఇలా ఉంతే ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు పెద్ద పీట వేయడం జరిగింది. దాంతో రాష్ట్రంలో టైర్స్, స్టీల్, ఇతర చిన్న మధ్యతరహా పరిశ్రమలు వరసబెట్టి ప్రారంభం అవుతున్నాయి అని అంటున్నారు. అంతే కాదు రాష్ట్రంలో శ్రీ సిటీలో ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్ పరికరాలు విడి భాగాల తయారీ ఊపందుకుందని నివేదికలు తెలియచేస్తునాయి. అంతే కాదు ఏపీలో అతి పెద్ద నగరం అయిన విశాఖలోని ఫార్మా సిటీలో సైతం పలు పరిశ్రమలు ఉత్పత్తికి శ్రీకారం చుట్టడం వైసీపీ ప్రభుత్వ సారధ్యంలోనే జరిగింది.

# బీసీల వెన్ను విరుస్తున్న వైయస్ జగన్మోహన్ రెడ్డి



పొన్నూరు మేజర్ న్యూస్ : బీసీల వెన్ను విరుస్తున్న జగన్ రెడ్డి పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆదివారం జరిగింది . జగన్ సర్కారుపై ధ్వజమెత్తిన పొన్నూరు నియోజకవర్గ బీసీ నాయకులు ఈ సందర్భంగా బీసీ నాయకులు మాట్లాడుతూస్థానిక సంస్థల ఎన్నికల్లో 25 ఏళ్లుగా 34% ఉన్న బీసీ రిజర్వేషన్లను 24%కి తగ్గించి 10% కోతతో 16,800 రాజ్యాంగబద్ధ బీసీ పదవుల్ని రద్దు చేసిన బీసీల నమ్మక ద్రోహి - జగన్మోహన్ రెడ్డి అని వారు దుయ్యబట్టారు.75 మందికి పైగా బీసీ నాయకులు ఈ ప్రభుత్వ అక్రమాలు ఎదిరించినందుకు హత్య చేయబడగా, 2,540 మంది ఈ నిరంకుశ పాలనలో దాడులకు గురయ్యారన్నారు. బీసీలను మానసికంగా దెబ్బతీయడానికి వారిపై 26,000 అక్రమ కేసులను పెట్టిన నమ్మకద్రోహి జగన్మోహన్ రెడ్డి అని వారు వాపోయారు.70 వేలకు పైగా బీసీ బ్యాక్ లాగ్ పోస్టులు భర్తీ చేయలేదని వారు దుయ్యబట్టారు.13 బీసీ భవనాలు, 1187 కమ్యూనిటీ హాళ్ల నిర్మాణాలను నిలిపివేసి జగన్మోహన్ రెడ్డి బీసీల అభ్యున్నతికి అడ్డు కట్టలు వేసిన నమ్మక ద్రోహి అని వారు పేర్కొన్నారు.14 లక్షల ఎకరాల అసైన్డ్ భూములు కబ్జా చేస్తున్నారు. అందులో అత్యధిక భాగం బీసీలవే నని వారు వాపోయారు. గత టీడీపీ ప్రభుత్వం బీసీ సబ్ ప్లాన్ కోసం రూ.36,475 కోట్లకు పైగా ఖర్చు చేసింది. కానీ ప్రస్తుతం రూ. 76,750 కోట్ల సబ్ ప్లాన్ నిధులను వైసీపీ దారి మళ్లించిందని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.టీడీపీ హయాంలో టీటీడీ ఛైర్మన్ లాంటి గౌరవప్రదమైన పదవులు బీసీలకిస్తే ఇప్పుడు 90% నామినేటెడ్ పదవులు, అడ్వైజర్ పదవులు ముఖ్యమంత్రి సామాజికవర్గం వారికే కేటాయించారని వారు ఆవేదన వ్యక్తం చేశారు.16 యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ పదవుల్లో టీడీపీ 9 బీసీలకిస్తే, ఇప్పుడు 1 మాత్రమే బీసీలకు ఇచ్చారని వారు దుయ్యబట్టారు.జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత బీసీలకు రూ.75, 760 కోట్ల బీసీ సబ్ ప్లాన్ నిధులను దారి మళ్లించార అని వారు వాపోయారు.ఆదరణ లాంటి 30కి పైగా బీసీ సంక్షేమ పథకాలు రద్దు చేశారన్నారు. రిజర్వేషన్లు 34% నుండి 24%కి తగ్గించి 16.800 రాజ్యాంగబద్ధ పదవులు దూరం చేశారన్నారు. 14 లక్షల ఎకరాల అసైన్డ్ భూములు కబ్జా చేస్తున్నారు. అందులో అత్యధిక భాగం బీసీలవే.70 వేలకు పైగా బీసీ బ్యాక్ లాగ్ పోస్టులు భర్తీ చేయలేద అని వారు ఆవేదన వ్యక్తం చేశారు.13 బీసీ భవనాలు, 1187 కమ్యూనిటీ హాళ్ల నిర్మాణాలను నిలిపివేశారన్నారు. సీనియారిటీలో 5వ స్థానంలో ఉన్న ద్వారకాతిరుమలరావు (బీసీ) తప్పించి 16వ స్థానం ఉన్న రాజేంద్రనాథ్ రెడ్డిని డీజీపీగా నియమించి జగన్మోహన్ రెడ్డి బీసీలకు అన్యాయం చేశారన్నారు. రూ.75,760 కోట్ల బీసీ సబ్ ప్లాన్ నిధులు దారి మళ్లించారన్నారు. ఆదరణ లాంటి 30కి పైగా బీసీ సంక్షేమ పథకాలు రద్దు చేశారన్నారు. రిజర్వేషన్లు 34% నుండి 24%కి తగ్గించి 16,800 రాజ్యాంగబద్ధ పదవులు దూరం చేశారన్నారు. 14 లక్షల ఎకరాల అసైన్డ్ భూములు కబ్జా చేస్తున్నారు. అందులో అత్యధిక భాగం బీసీలవే అన్నారు. 74 మంది బీసీలను హత్య చేశారు. వేల మందిపై తప్పుడు కేసులు పెట్టి, దాడులు చేసి వేధించారు.బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ రద్దుకు సుప్రీంకోర్టుకు వెళ్లి చీవాట్లు తిన్నారన్నారు.విదేశీ విద్య, పెళ్లి కానుకలు, చంద్రన్న బీమా వంటి పథకాలు రద్దు చేశారన్నారు.మద్యం ధరలు పెంచి, నాసిరకమైన మద్యం పోసి 35 లక్షల మంది ఆరోగ్యాన్ని పాడుచేశారు. అందులో 30వేల మంది ప్రాణాలు తీసి వారి భార్యల మాంగళ్యాలు తెంచారన్నారు. మద్యం బాధితుల్లో అత్యధికులు బీసీలే అన్నారు .ధరలు, ఛార్జీల బాదుడుతో ఒక్కో కుటుంబంపై రూ.2.80లక్షల భారం వేశారన్నారు.రాష్ట్ర ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్స్ ఇవ్వకపోవడంతో కేంద్ర నిధులు రూ.16వేల కోట్లు పోయాయన్నారు. 16 యూనివర్శిటీల్లో వీసీలుగా ఒక్కరే బీసీ. మిగిలిన వాటిలో సొంత సామాజిక వర్గంతో నింపారన్నారు. నామినేటెడ్ పదవుల్లో 90 శాతం సొంత వర్గమే. సలహాదారుల్లో ఒక్క బీసీ కూడా లేదు. అమరావతిలో 10 ఎకరాల్లో 'జ్యోతీరావు పూలే' విగ్రహం, మెమోరియల్ ఏర్పాటును రద్దు చేశారన్నారు.56 కార్పొరేషన్లు ఏర్పాటు చేసి నిధులు ఇవ్వకుండా ఉత్తుత్త విగ్రహాలను చేశారన్నారు. టీడీపీకి చెందిన బీసీ నేతలు కింజరాపు అచ్చెన్నాయుడు, యనమల రామకృష్ణుడు, చింతకాయల అయ్యన్న పాత్రుడు, కిమిడి కళా వెంకట్రావు, కొల్లు రవీంద్ర, బీదా రవిచంద్ర యాదవ్, కాలవ శ్రీనివాసులు, బందారు సత్యన్నారాయణ మూర్తి, కూన రవికుమార్, పల్లా శ్రీనివాస్ యాదవ్, ఆదిరెడ్డి అప్పారావు కుటుంబం, పంచుమర్తి అనురాధ, గౌతు శిరీష లాంటి వారిపై కేసులు పెట్టి వేధించారన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర బి. సి సెల్ అధికార ప్రతినిధి వీరంకి రంగారావు, చేబ్రోలు మండల పార్టీ అధ్యక్షుడులు మైల వెంకట రామరాజు, పెదకాకాని గ్రామ శివాలయ దేవస్థాన మాజీ చైర్మన్ దర్భి భాస్కరరావు, జిల్లా బి. సి సెల్ ఉపా అధ్యక్షులు గిరాబోయిన బసవ శ్రీనువస రావు, జిల్లా రైతు కమిటీ ప్రధాన కార్యదర్శి కుటుంబరక వెంకట్రావు, పొన్నూరు మండల బి. సి సెల్ అధ్యక్షులు తాడిశెట్టి ఏడుకొండలు, చేబ్రోలు మండల బి. సి సెల్ అధ్యక్షులు ఉయ్యూరు నాగరాజు, తోట శంకర్ రావు, తోట శ్రీనువస రావు, అనంత లక్ష్మీ నారాయణ, సురగని గోవింద్,జొర్రు శివయ్య, యామినేని సుబ్బారావు, యాలవర్తి వీరయ్య, బుద్ద బిరయ్య, కొండ్రు వెంకటేష్, ఖగ్గ చిన్న వెంకట నరసయ్య, దాసరి మహాకాళేశ్వర సుబ్రహ్మణ్యం, కొండుబాక వెంకట్రావు, తాళ్ళ శ్రీనివాసరావు, కుక్కల మల్లీ ఖార్జున రావు, అలా సాంబ శివరావు, మైల ఏడుకొండలు, చిలమకురి వెంకటేశ్వరరావు, కట్టేబోయిన సాంబ శివరావు,రావూరి శివయ్య, కొండవీటి సుబ్రహ్మణ్యం, అడపా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# పౌల్ట్రీ చరిత్రలో కోడిగుడ్డు ఆల్‌టైమ్ రికార్డు



గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో : పౌల్ట్రీ రంగంలో సరికొత్త రికార్డు నమోదైంది. కోడి గుడ్డు రైతు ధర రూ.5.79కు చేరి పాత రికార్డులను తిరగరాసింది. ఈ ఏడాది ఇదే అత్యధిక రైతు ధర కావడం గమనార్హం. కాగా.. పెరిగిన మేత ధరలతో గుడ్డు ధర పెరిగినా ప్రయోజనం అంతంత మాత్రమేనని పౌల్ట్రీ రైతులు అంటున్నారు. మరోపక్క రిటైల్ మార్కెట్లో గుడ్డు రూ.7కు చేరింది. ఇదే ధర మరికొంత కాలం కొనసాగితే.. నష్టాల నుంచి గట్టెక్కుతామని పౌల్ట్రీ రైతులు చెబుతున్నారు. 60 శాతం ఉత్తరాదికి ఎగుమతి రాష్ట్రంలో 2 వేలకు పైగా కోళ్లఫారాలు ఉండగా.. వాటిలో ప్రస్తుతం 5.60 కోట్లకు పైగా కోళ్ళ ఉన్నాయి. రోజుకు 6 కోట్ల గుడ్ల ఉత్పత్తి సామర్థ్యం ఉన్నప్పటికీ.. ప్రస్తుతం సగటున 4.20 కోట్ల నుం చి 4.75 కోట్ల మధ్య గుడ్లు ఉత్పత్తి అవుతున్నాయి. వీటిలో 40 శాతం స్థానికంగానే వినియోగిస్తుండగా.. మిగిలిన 60 శాతం బీహార్, పశ్చిమ బెంగాల్, అసోం, నాగాలాండ్, మణిపూర్, ఒడిశా రాష్ట్రాలకు ఎగుమతి అవుతున్నాయి. శీతల ప్రభావం ఉండే నవంబర్ నుంచి ఫిబ్రవరి వరకు పౌల్ట్రీకి ముఖ్య సీజన్‌గా భావిస్తారు. ఏటా ఈ సీజన్‌లో అత్యధిక ధర నమోదవుతుంటుంది. 2017-18 సీజన్‌లో రూ.5.45 అత్యధిక ధర నమోదైంది. ఆ తర్వాత ఉత్తరాది రాష్ట్రాల్లో పౌల్ట్రీలు విస్తరించడం, ఎగుమతుల్లో ఇతర రాష్ట్రాల పోటీతో సీజన్ కలిసి రాక రైతు ధర రూ.5 దాటడం గగనంగా ఉండేది. చరిత్రలో ఇదే గరిష్ట ధర ఉత్తరాదిన కోళు ఫ్లూ బారిన పడటంతో ఎగుమతులుకు డిమాండ్ ఏర్పడి నాలుగేళ్ల తర్వాత 2022%--%23 పౌల్ట్రీ సీజన్‌లో రూ.5.57 గరిష్ట ధర పలికింది. కాగా.. ప్రస్తుత సీజన్ ఆరంభంలో ధరలో ఒడిదొడుకులు ఎదురైనా.. వారం, 10 రోజుల నుంచి ఫామ్ గేట్ వద్ద గుడ్డు ధర అనూహ్యంగా పెరుగుతూ బుధువారం రూ.5.79కి చేరి ఆల్‌టైమ్ రికార్డు నమోదైంది. కార్తీక మాసం ముగియడం, క్రిస్మస్, నూతన సంవత్సర వేడుకలు, సంక్రాంతి పండగల నేపథ్యంలో స్థానిక వినియోగం మరింత పెరగనుండటంతో ఫామ్ గేట్ వద్ద ధర మరింత పెరిగే అవకాశం ఉందంటున్నారు. నూకలు దొరకట్లేదు పౌల్ట్రీ పరిశ్రమలో విరివిగా ఉపయోగించే నూకలు టన్ను రూ.13 వేల నుంచి ఏకంగా రూ.25 వేలకు చేరింది. నూకలను ఎక్కువగా ఇథనాల్ ఉత్పత్తికి మళ్లిస్తుండటంతో మార్కెట్లో దొరకని పరిస్థితి నెలకొంది. ఫలితంగా నూకలకు బదులు మొక్కజొన్నపైనే రైతులు ఆధారపడాల్సి వస్తోంది. మొక్కజొన్న కూడా టన్ను రూ.17 వేల నుంచి రూ.25 వేలకు పెరిగింది. సోయాబీన్ టన్ను రూ.48 వేల నుంచి రూ.50 వేల మధ్య పలుకుతోంది. ఆయిల్ తీసిన తవుడు (డీవోసీ) టన్ను రూ.12 వేల నుంచి రూ.18 వేలకు పెరిగింది. పెరిగిన మేత ధరలతో పాటు మందులు, వ్యాక్సిన్ల ధరలు, కార్మికుల జీతాలు పెరగడం పౌల్ట్రీల నిర్వహణ వ్యయాన్ని గణనీయంగా పెంచేసింది. ఫలితంగా పిల్ల దశ నుంచి గుడ్డు పెట్టే దశ వరకు ఒక్కో కోడికి గతేడాది రూ.300-310 ఖర్చు కాగా.. ప్రస్తుతం రూ.360-370 ఖర్చవుతోంది. పట్టణ ప్రాంతాల్లో రిటైల్ మార్కెట్‌లో గుడ్డు ధర రూ.7, మారుమూల పల్లెల్లో రూ.7.50 వరకు పలుకుతోంది. సాధారణంగా రైతు ధరకు 40-50 పైసలు అదనంగా చేర్చి బహిరంగ మార్కెట్‌లో విక్రయిస్తుంటారు.

# రాజధానిలో తాగునీటి పైపుల తరలింపు

**-ఆందోళన చెంచుతున్న రైతులు**

తుళ్లూరు, మేజర్ న్యూస్ : రాజధాని నిర్మాణ సామగ్రిని గుత్తేదారు సంస్థ తరలిస్తుండటంతో రాజధాని రైతులు ఆందోళనకు గురవుతున్నారు. శనివారం రాజధాని భూముల్లోని తాగునీటి పైపులను కొందరు వ్యక్తులు లారీల్లో తరలించారు. అమరావతి నిర్మాణానికి గత ప్రభుత్వం సంకల్పించిన విషయం తెలిసిందే. బృహత్ ప్రణాళికను తయారుచేసి విశాలమైన రహదారులు, అండర్ గ్రౌండ్ విధానంలో తాగునీరు, విద్యుత్, టెలిఫోన్, మురుగునీటి పారుదల సదుపాయాలను కల్పించేందుకు టెండర్లు పిలిచి పనులు ప్రారంభించింది. వైకాపా అధికారం చేపట్టిన తరువాత రాజధాని పనులు నిలిచిపోయాయి. గుత్తేదారు సంస్థ తీసుకొచ్చిన నిర్మాణ సామగ్రి ఎక్కడివి అక్కడే ఉండిపోయాయి. రాజధాని గ్రామం కురగల్లు వద్ద ఉన్న తాగునీటి పైపులను శనివారం సాయంత్రం పెద్ద లారీల్లో తరలించడం రైతులు గమనించారు. రాజధాని నిర్మాణ గుత్తేదారు సంస్థ మేఘా ఇంజినీరింగ్‌కు చెందిన పైపులను అనంతపురం జిల్లా డోన్‌కు తరలిస్తున్నట్లు లారీ డ్రైవర్లు తెలిపారు.

# ఏపీలోనూ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం...!



గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో : మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం ఏపీలోనూ ప్రారంభానికి రంగం సిద్ధం అవుతోంది. తొలుత కర్ణాటకలో ఈ పథకం ప్రారంభించారు. తెలంగాణలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చి..అధికారంలోకి వచ్చిన తరువాత అమలు చేస్తోంది. టీడీపీ దీనిని తమ ఎన్నికల గ్యారంటీల్లో చేర్చింది. ఇప్పుడు ఏపీలో వైసీపీ ప్రభుత్వం రాష్ట్రంలో అమలు పైన సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తోంది. అన్నీ పరిగణలోకి తీసుకొని.. సంక్రాంతి నుంచి అమలు చేసేలా నిర్ణయం తీసుకొనే అవకాశం కనిపిస్తోంది. ఉచిత బస్సు ప్రయాణం: మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం పై మంచి స్పందన కనిపిస్తోంది. కర్ణాటక, తెలంగాణలోనూ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. దీంతో, ఏపీలోనూ మహిళల్లో ఈ ఉచిత బస్సు ప్రయాణం పైన చర్చ మొదలైంది. ఏపీలో మరో నాలుగు నెలల్లో ఎన్నికలు జరగనున్నాయి. సీఎం జగన్ తాను అమలు చేస్తున్న సంక్షేమం తనకు తిరిగి అధికారం నిలబెడుతుందనే నమ్మకంతో ఉన్నారు. టీడీపీ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం తాము అధికారంలోకి వస్తే అమలు చేస్తామని ప్రకటించింది. మహిళల్లో స్పందన కనిపిస్తున్న ఈ పథకం పైన ఇప్పుడు ఏపీ ప్రభుత్వం ఫోకస్ చేసినట్లు తెలుస్తోంది. ఏపీలో ఇప్పటికే ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేసారు. అధికారుల కసరత్తు: ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు పైన ప్రస్తుతం సాధ్యాసాధ్యాలపైన ఉన్నతాధికారులు అధ్యయనం చేస్తున్నారు. దీని పైన ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్నారు. ఈ పథకం అమలు దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ సంక్రాంతి పండుగ నుంచి అమలు చేయాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. పొరుగు రాష్ట్రాల్లో ఈ పథకం ఎలా అమలు చేస్తున్నారు..ఏ మేర భారం పడుతుందనే అంశాల పైన అధికారులు నివేదికలు సిద్దం చేస్తున్నారు. దీని ద్వారా ఆర్టీసీకి రాబడి ఎంత తగ్గే అవకాశం ఉంది. ప్రభుత్వం ఏ మేర భర్తీ చేయాల్సి ఉంటుందనే అంశాల పైన కసరత్తు కొనసాగుతోంది. ఏపీఎస్ఆర్టీసీ బస్సుల్లో నిత్యం సగటున 40 లక్షల మంది ప్రయాణిస్తున్నారు. వీరిలో 15 లక్షల మంది వరకు మహిళలు ఉంటారని అంచనా. సంక్రాంతి నుంచి అమలు: అన్ని రకాల పాస్ లు కలిగిన వారు 10 లక్షల మంది ఉంటారు. ఇందులో 3-4 లక్షల మంది విద్యార్థినులు, మహిళలు ఉంటారు. ప్రస్తుతం నిత్యం ప్రయాణించే వారి ద్వారా ఆర్టీసీకి సగటున రూ 17 కోట్ల వరకు రాబడి వస్తోంది.ఒక వేళ మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయం అమలు చేస్తే నిత్యం రూ 6 కోట్ల వరకు ఆదాయం తగ్గుతుందని అంచనా వేస్తున్నారు. ఈ వివరాలన్నీ నివేదిక రూపంలో సిద్దం చేస్తున్నారు. ప్రతిపక్షాలకు అవకాశం లేకుండా ముందుగానే అమలు చేయాలనే ఆలోచనలో ప్రభుత్వంలోని ముఖ్యులు ఉన్నట్లు చెబుతున్నారు. దీని పైన త్వరలోనే ప్రభుత్వం అధికారికంగా తమ నిర్ణయం ప్రకటించే అవకాశం ఉంది. ఇది అమల్లోకి వస్తే ఏపీలో మహిళలకు కర్ణాటక, తెలంగాణ తరహాలోనే బస్సుల్లో ఉచిత ప్రయాణానికి అవకాశం దక్కుతుంది.

# జగ్గారపు రాము టీడీపీలో చేరిక



మంగళగిరి మేజర్ న్యూస్: మంగళగిరి సమగ్రాభివృద్ధి కోసం ప్రతిఒక్కరూ కలసిరావాలన్న యువనేత నారా లోకేష్ పిలుపునకు నియోజకవర్గంలో భారీగా స్పందన లభిస్తోంది. లోకేష్ నినాదానికి ఆకర్షితులైన పలువురు తటస్థులు, వైసిపితోపాటు వివిధపార్టీల నేతలు, వివిధ రంగాల ప్రముఖులు యువనేత సమక్షంలో టిడిపిలో చేరుతున్నారు. ఆదివారం సాయంత్రంలో ఉండవల్లిలోని నివాసంలో పలువురు ప్రముఖులు టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. వారందరికీ లోకేష్ పసుపుకండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. బిజెపి వీవర్స్ వింగ్ రాష్ట్ర అధ్యక్షుడు, మంగళగిరి లక్ష్మీనరసింహ స్వర్ణకార సంఘం అధ్యక్షుడు జగ్గారపు రామ్మోహన్ రావు (రాము), ఆయన కుమారుడు జగ్గారపు రామ్ లక్ష్మణ్ వివేక్ తో పాటు మంగళగిరి పట్టణానికి చెందిన 100 కుటుంబాలు మరియు తాడేపల్లి పట్టణం 14వ వార్డుకు చెందిన పెద్దింటి బాబురావు, బొల్లెద్దుల మరియన్న, నందిగం సదాశివ రావు తో పాటు వైకాపా కు చెందిన 60 కుటుంబాలు లోకేష్ సమక్షంలో టిడిపి లో చేరారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ... మంగళగిరిని రాష్ట్రంలోనే నెం.1గా తీర్చిదిద్దే ప్రణాళికలు తమవద్ద ఉన్నాయని తెలిపారు. మరో 3నెలల్లో చంద్రబాబు నాయుడు నేతృత్వంలో ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మంగళగిరి సమగ్రాభివృద్ధికి తమవద్ద ఉన్న ప్రణాళికలను అమలుచేస్తానని చెప్పారు. వివిధ రాజకీయపార్టీల నాయకులతోపాటు తటస్థులు, వివిధ రంగాల ప్రముఖులు, పారిశ్రామికవేత్తలు తనపై నమ్మకంతో పార్టీలోకి రావడం ఆనందంగా ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్దయ్య మరియు ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గ్రామ గ్రామాన. కొనసాగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష



గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో : ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సారథ్యంలోని వై ఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం మరో కార్యక్రమానికి శ్రీకారం చుట్టనుంది. రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చేపట్టింది. నేడు దీన్ని ప్రారంభించనుంది. రాష్ట్రంలోని పేదలందరికీ కుటుంబ సంక్షేమం, ఆరోగ్య భరోసా కల్పించడంలో భాగంగా ఈ పథకానికి శ్రీకారం చుట్టింది. ఇదివరకు తొలి విడత కార్యక్రమాన్ని పూర్తి చేసిన విషయం తెలిసిందే. సెప్టెంబర్ 30వ తేదీ నుంచి 50 రోజుల పాటు కొనసాగింది. వార్డు/గ్రామ వలంటీర్లు, ఎఎన్ఎంలు రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ వెళ్లి, ప్రజల ఆరోగ్య అవసరాలను గుర్తించారు. ఆరోగ్య పరమైన సమస్యలు ఉన్న వారి కోసం గ్రామాలు, వార్డుల్లోనే హెల్త్ క్యాంపులను నిర్వహించారు. వైద్య సేవలను అందించారు. దీర్ఘకాలిక అనారోగ్యానికి గురైన వారికి ఆసుపత్రులకూ సిఫారసు చేశారు. ఈ కార్యక్రమం విజయవంతమైంది. మొత్తం 60 లక్షల మందికి వాళ్ల ఇంటి వద్దే నాణ్యమైన వైద్యాన్ని అందించింది ప్రభుత్వం. రోగులు ఆసుపత్రుల వరకూ వెళ్లకుండా వారికి ఇంటివద్దే సమగ్ర వైద్యాన్ని అందజేసింది ఏపీ ప్రభుత్వం. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చేపట్టిన తరువాత ఆసుపత్రుల్లో ఓపీ పేషెంట్ల సంఖ్య భారీగా తగ్గిందనే ప్రచారం సైతం జరిగింది. ప్రజల నుంచి దీనికి అద్భుత స్పందన లభించింది. ఫలితంగా- రెండో విడత ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చేపట్టాలని నిర్ణయించింది. నేటి నుంచి గ్రామాల్లో వైద్య శిబిరాలు మొదలు కానున్నాయి. రేపటి నుంచి పట్టణాలు, నగరాల్లో ఈ శిబిరాలు అందుబాటులోకి వస్తాయి. వచ్చే ఆరు నెలల పాటు ఈ కార్యక్రమం కొనసాగుతుంది. ఈ ఆరు నెలల్లో 13,954 శిబిరాలను నిర్వహిస్తారు. గ్రామాల్లో 10,032, పట్టణాలు- నగర ప్రాంతాల్లో 3,922 ఆరోగ్య శిబిరాలు ఏర్పాటవుతాయి. ఒక్కో వైద్య శిబిరం వద్ద 105 రకాల మందులు, అన్ని రకాల వైద్య పరికరాలు అందుబాటులో ఉంచడానికి జగన్ ప్రభుత్వం ఏర్పాట్లు పూర్తి చేసింది.

# నృసింహుని సన్నిధిలో నారా లోకేష్ కుటుంబం ప్రత్యేక పూజలు

మంగళగిరి మేజర్ న్యూస్: మంగళగిరిలోని ప్రముఖ ఆలయాలను టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ కుటుంబసమేతంగా సందర్శించారు. ఆదివారం ఉదయం తల్లి భువనేశ్వరి, భార్య బ్రాహ్మిణి, తనయుడు దేవాన్ష్‌తో కలిసి నారా లోకేష్ మంగళగిరిలోని ప్రముఖ దేవాలయాల్లో పూజలు నిర్వహించారు. ముందుగా మంగళగిరి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రదక్షిణలు చేశారు. పండితుల వేదమంత్రోచ్ఛారణల మధ్య స్వామివారికి కిరీటం అలంకరించి, చెంచులక్ష్మి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. రాజ్య లక్ష్మీ అమ్మవారి సన్నిధిలో పూజలు చేసి, పట్టువస్త్రాలు సమర్పించి, వేదపండితుల ఆశీర్వచనం అందుకున్నారు. శివాలయంలో భక్తిశ్రద్ధలతో పూజలుచేశారు. అనంతరం పానకాల లక్ష్మీనరసింహ స్వామి మెట్లపూజ చేశారు. మెట్ల మార్గంలో వెళ్లి



పానకాల స్వామిని దర్శించుకున్నారు. కొండపైన ఉన్న రాజ్యలక్ష్మి అమ్మవారిని పూజించి హారం, పట్టువస్త్రాలు సమర్పించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు నందం అబద్ధయ్య, పోతినేని శ్రీనివాసరావు, ఆకుల జయసత్య, తమ్మిసెట్టి జానకీదేవి,దామర్ల రాజు, ఆరుద్ర భూ లక్ష్మి, భోగి వినోద్, పడవల మహేష్, కందుల నాగార్జున,



తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుల కన్నీళ్లలో వైసీపీ కొట్టుకుపోవటం ఖాయం



గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో : కార్మికుల కష్టాలు పట్టని కసాయి సర్కార్ పోస్టర్లను ఆవిష్కరించిన జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ పారిశుద్ధ్య కార్మికుల కాళ్ళు కడిగినా రుణం తీర్చుకోలేమంటూ ప్రతిపక్ష నేతగా మాట్లాడిన జగన్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక తన అరాచకపాలనతో కార్మికుల జీవితాలను కన్నీటిమయం చేశారని జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికుల కన్నీళ్లలో వైసీపీ ప్రభుత్వం కొట్టుకుపోవటం ఖాయమంటూ మండిపడ్డారు. కార్మిక సంఘ జే ఏ సీ సభ్యులు సోమి శంకరరావు ఆధ్వర్యంలో రూపొందించిన కార్మికుల కష్టాలు పట్టని కసాయి సర్కార్ గోడప్రతులను ఆదివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ తెల్లవారక ముందే విధుల్లో చేరి మల మూత్రాలతో , చెత్తాచెదారంతో నిండిన పరిసరాలను శుభ్రం చేసి ప్రజలకు ఆరోగ్యాన్నిచ్చేందుకు తమ ప్రాణాలను ఫణంగా పెట్టే పారిశుద్ధ్య కార్మికుల సమస్యలను ముఖ్యమంత్రి పెడచెవిన పెట్టడం దుర్మార్గమన్నారు. కార్మికులేమి గొంతెమ్మ కోర్కెలు కోరడం లేదని , జగన్ రెడ్డి అసెంబ్లీ సాక్షిగా ఇచ్చిన హామీలనే నెరవేర్చమంటున్నారన్నారు. కష్టానికి తగ్గ ప్రతిఫలం అడగటం ముఖ్యమంత్రికి పెద్ద నేరంగా కనపడుతుందంటూ దుయ్యబట్టారు. పారిశుద్ధ్య కార్మికుల సమ్మెతో ఇప్పటికే రాష్ట్రం మొత్తం దుర్గంధమయంగా మారిందన్నారు. దీంతో ప్రజలు అనారోగ్యం పాలయ్యే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికుల సమస్యలకు ప్రభుత్వం వీలైనంత తొందరగా పరిష్కారం చూపాలన్నారు. మనసులేని వ్యక్తి రాష్ట్రానికి ముఖ్యమంత్రి అవ్వటం ఈ రాష్ట్ర ప్రజలు ఏనాడో చేసుకున్న దురదృష్టమన్నారు. కార్మికులు చేపట్టిన రాష్ట్ర వ్యాప్త సమ్మెకు జనసేన పూర్తి మద్దతు నిస్తుందని తెలిపారు. సమస్య పరిష్కారం అయ్యేవరకు కార్మిక సంఘాలు తీసుకునే ఎలాంటి పోరాటాలకైనా జనసేన అండగా నిలుస్తుందని మనోహర్ అన్నారు. కార్మిక సంఘ నేత సోమి శంకరరావు సమ్మె జరుగుతున్న తీరును మనోహర్ కు వివరించారు. పారిశుద్ధ్య కార్మికుల సమ్మెకు ప్రజల నుంచి పెద్దఎత్తున మద్దతు లభిస్తుందని శంకరరావు అన్నారు. ఈ సందర్భంగా ఉధృతంగా సాగుతున్న సమ్మె విషయమై పవన్ కల్యాణ్ తో మాట్లాడతానని నాదెండ్ల మనోహర్ అన్నారు. జిల్లా జనసేన పార్టీ అధికార ప్రతినిధి ఆళ్ళ హరి, వీరమహిళ నిస్సంకర అనసూయ, రెల్లి యువ నేత సోమి ఉదయ్ కుమార్, డివిజన్ అధ్యక్షులు గుర్రాల ఉమ, సయ్యద్ షర్ఫుద్దీన్, గద్దం రోశయ్య, నండూరి స్వామి, వద్దె సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల ప్రవర్తనను గమనించాలి : డాక్టర్ లావు రత్తయ్య

గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో : అధ్యాపకులు, కౌన్సిలర్లు తరగతి గదిలోని విద్యార్థుల ప్రవర్తనను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండా లని విజ్ఞాన్స్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలోని సోషల్ సైన్సెస్ అండ్ హుమానిటీస్, అకాడమీ ఫర్ ఫ్యాకల్టీ డెవలప్ మెంట్, ఐక్యూఏసీ, ఏపీఏ ఇండియాల సంయుక్త ఆధ్వర్యంలో "ఎంపవరింగ్ త్రూ ప్రివెన్షన్ – ప్రొఫెషనల్ ట్రైనింగ్ ఆన్ లైఫ్-సేవింగ్ ఎడ్యుకేషన్" అనే అంశంపై మూడు రోజుల పాటు అధ్యాపకులకు, కౌన్సిలర్‌లకు నిర్వహించిన వర్క్‌షాప్‌ను ఆదివారం ఘనంగా ముగించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విజ్ఞాన్స్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య విద్యార్థులకు అధ్యాప కులు వాళ్ల పరిధిని దాటి క్రియేటివ్‌గా, సరికొత్తగా ఆలోచించేలా ప్రేరిపించాలన్నారు. విద్యార్థులకు సమస్యలు ఎదురైనప్పుడు అది




విద్యార్థి సమస్యలా భావించకుండా తానైతే ఎలా ఎదుర్కొంటారో ఆ విధంగా పరిష్కరించాలన్నారు. కార్యక్రమానికి మరో ముఖ్య అతిథిగా హాజరైన వర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్ మాట్లాడుతూ మనసంతా ప్రతికూల ఆలోచనలతో నిండిపోతే ఏ పనీ చేయాలనిపించదన్నారు. గతంతో మొదలు పెట్టిన పనినీ చివరి వరకూ కొనసాగించలేరు. ఏ విషయం గురించైనా ప్రతికూలంగా ఆలోచిస్తే నిరాశ పెరిగిపోతుంది. ఎప్పటికప్పుడు సానుకూలంగా ఆలోచించడానికి ప్రయత్నిస్తే ఏ పనినైనా సగంలోనే వదిలిపెట్టాల్సిన అవసరం రాదన్నారు. కాబట్టి ఎంతటి క్లిష్ట పరిస్థితులనైనా సానుకూల ఆలోచనలతో జయించవచ్చనే విషయాన్ని గుర్తుంచుకోవాలని తెలియజేసారు. కార్యక్రమంలో ఏపీఏఐ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ క్రిష్ణ భరత్, ఉస్మానియా యూనివర్సిటీ యూజీసీ-హెచ్ఆర్‌డీసీ అసిస్టెంట్ డైరక్టర్ డాక్టర్ పీ.స్వాతి, హైదరాబాద్‌లోని పీడియాట్రిక్ సైకాలజిస్ట్ గంగాధర్ బరెడ్డి, వైజాగ్‌లోని ద వింగ్స్ ఆఫ్ మైండ్ ఫౌండర్, సైకాలజిస్ట్ అండ్ జర్నలిస్ట్ రమ్య అగస్తి, బెజవాడ ఇనిస్టిట్యూట్ ఫర్ లెర్నింగ్ డెవలప్‌మెంట్ లక్ష్మీరావ్, ఏపీఏఐ ఏపీ కమిటీ ప్రెసిడెంట్ ఎమ్‌పీ జానకిరామ్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపకులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

# అంగన్వాడీల డిమాండ్లలో ఒక్కటే మిగిలింది: మంత్రి బొత్స. వెల్లడి

గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో : అంగన్వాడీల 11 డిమాండ్లలో ఇప్పటికే 10 పరిష్కరించామని ఏపీ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. మిగిలిన ఒక్కటి కూడా 3 నెలల తర్వాత పరిశీలిస్తామని చెప్పారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో మళ్లీ తామే అధికారంలోకి వస్తామని, అంగన్వాడీల సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. ప్రభుత్వాలు ఐదేళ్లకు ఒక్కసారే ఉద్యోగుల జీతాలు పెంచుతాయని, రెండు మూడేళ్లకు పెంచడం సాధ్యం కాదని స్పష్టం చేశారు. అంగన్వాడీల డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు.

# ముక్కామల వెంకట లక్ష్మీ శ్రీనివాస్ జ్ఞాపకార్థంగా స్పందనలో దుప్పట్లు పంపిణీ



**గన్నవరం, జనవరి 7, మేజర్ న్యూస్ :** గన్నవరం మండలం దావాజిగూడెం లో హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్పందన మానసిక వికాస కేంద్రం లో కృష్ణా జిల్లా సి.పి.ఐ పార్టీ రైతు సంఘం నాయకులు ముక్కామల ఉమామహేశ్వరరావు కుమారుడు ముక్కామల వెంకట లక్ష్మి శ్రీనివాస్ వర్ధంతి దినోత్సవం కార్యక్రమం ఆదివారం జరిగింది. సి.పి.ఐ.పార్టీ జాతీయ కార్యదర్శి సభ్యులు అక్కినేని వనజ మాట్లాడుతూ కృష్ణా జిల్లా సి.పి.ఐ రైతు సంఘం నాయకులు ముక్కామల ఉమా మహేశ్వర రావు కుమారుడు వెంకట లక్ష్మి శ్రీనివాస్ జ్ఞాపకం గా స్పందన మానసిక వికాస కేంద్రం లో మంచి కార్యక్రమం చెయ్యడం చాలా అభినందనీయమని ఆమె అన్నారు. గన్నవరం ప్రాంతంలో దివ్యాంగుల కొరకు స్పందన వంటి సంస్థ ను ఏర్పాటు చేసి ఉచితంగా విద్యా వైద్య రవాణా భోజన సౌకర్యాలు ఏర్పాటు చెయ్యడం చాలా ఆర్థిక భారంతో కూడినది అయినప్పటికీ ఎంతో దిగ్విజయంగా నిర్వహిస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ చైర్మన్ సంకాబత్తుల వెంకట్ ను ఆమె అభినందనలు తెలిపారు. మా సహాయ సహకారాలు అందిస్తామని, స్పందన లో చేస్తున్న సేవా కార్యక్రమాలకు తోడ్పాటు అందించాలని అక్కినేని వనజ పిలుపునిచ్చారు. డి.యస్.పీ నాదెండ్ల.యస్.బి.మురళి కృష్ణ మాట్లాడుతూ ముక్కామల వెంకట లక్ష్మి శ్రీనివాస్ పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని ఆయన కోరారు. స్పందన లో దివ్యాంగులకు అత్యుత్తమ సేవలు అందిస్తున్న సంస్థ చైర్మన్ సంకాబత్తుల వెంకట్ ను ప్రిన్సిపాల్ రజిత వెంకట్ ను ఆయన అభినందించారు. హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ ఆధ్వర్యంలో దివ్యాంగుల అభివృద్ధి, సంక్షేమానికి కృషి అమూల్యమైనదని, ఇలాంటి సంస్థ లకు అండగా ఉంటామని, దివ్యాంగులకు చేస్తున్న సేవ దైవ సేవతో సమానమని డి.యస్.పి మురళీకృష్ణ అన్నారు. అనంతరం ముక్కామల వెంకట లక్ష్మి శ్రీనివాస్ జ్ఞాపకార్థం గా స్పందన బాలలకు దుప్పట్లు పంపిణీ చెయ్యడం జరిగింది. ఈ కార్యక్రమం లో హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ చైర్మన్ సంకాబత్తుల వెంకట్ స్పందన మానసిక వికాస కేంద్రం ప్రిన్సిపాల్ సంకాబత్తుల రజిత వెంకట్ గన్నవరం నియోజకవర్గం సి.పి.ఐ కార్యదర్శి పెద్దు వాసుదేవ రావు, గన్నవరం పట్టణ కార్యదర్శి కాట్రగడ్డ రామచంద్ర జోషి, కృష్ణా జిల్లా రైతు సంఘం నాయకులు సెనగల సుబ్బారెడ్డి, నాయకులు కట్టవరపు విజయరావు, వెంకటేశ్వర రావు, ముక్కామల వెంకట లక్ష్మి శ్రీనివాస్ సతీమణి రజిని, పిల్లలు వెంకట సాయి ప్రసాద్, సాయిరత్న, స్పందన సిబ్బంది పాల్గొన్నారు.

## అంగన్‌వాడీలపై యస్మా చట్టం దుర్మార్గమైన చర్య



**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** అంగన్‌వాడీలపై యస్మా చట్టం ప్రయోగించడం దుర్మార్గమైన చర్య అని జనసేన పార్టీ జిల్లా అధికార ప్రతి నిధి రాయపూడి వేణుగోపాలరావు అన్నారు. గత 27 రోజులుగా నియోజకవర్గంలోని అం గన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు చేస్తున్న నిరసన కార్యక్రమానికి ఆదివారం రాయపూడి మద్ద తు ప్రకటించి మాట్లాడారు. అంగన్‌వాడీల సమస్యలకు రాష్ట్ర ప్రభుత్వం పరిష్కారం ఆలో చించకుండా యస్మా చట్టం ప్రయోగించి వాళ్ళ హక్కులకు భంగం కలిగిం చడం బాధాకరం అని ఈ చట్టాన్ని ఉపయోగించి వారి గొంతు నొక్కడం దుర్మార్గమైన చర్య అన్నారు. రెక్కాడితే కానీ డొక్కాడని నిరు పేద మహిళల పట్ల ప్రభుత్వం వివక్షత చూపడం బాధాకరం అని, నా అక్కలు, నా చెల్లె మ్మలు, నా ఎస్.సి లు, నా బిసి లు అని ముసలి కన్నీరు కార్చే రాష్ట్ర ముఖ్య మంత్రి జగన్‌మోహన్‌రెడ్డి భూటకపు మాటలు రాష్ట్ర ప్రజలకు నేడు అర్థం అయ్యాయన్నారు. తమ సమస్యల కోసం పోరాటాలు చేస్తున్న వారిపైన, ప్రతి పక్షాల వారి పైన ప్రభుత్వం పోలీసు వ్యవస్థను అడ్డు పెట్టుకుని అణచి వేయడం చాలా బాధాకరం అని అంగన్‌వాడీల న్యాయమైన కోర్కెలను తీర్చా లని అదే విధంగా ప్రభుత్వం జారీ చేసిన జిఒ నెం 2 ను వెంటనే రద్దు చేసి యస్మా చట్టాన్ని వెనక్కి తీసుకోవాలని పార్టీ తరుపున ప్రభుత్వాన్ని రాయపూడి డిమాండ్ చేశారు.

## ముగిసిన యోగా కార్యక్రమం



**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ యోగసభ చింత గుంట పాలెం వారి ఆధ్వర్యంలో గత వారం రోజులుగా నిర్వహిస్తున్న యోగ విద్యా తరగతులు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ములక్ రాజాజీ రాజావారి 125వ జయంతి యోగా నిర్వాహకులు ఘనంగా నిర్వ హించారు. యోగాచారిని దమయంతీజీ ఆధ్వర్యంలో యోగ శిక్షణా తరగ తులు నిర్వహించారు. ప్రాణాయామం, ధ్యానం, సకల రోగాలను నిర్మూలిం చవచ్చని థైరాయిడ్, ఆస్మా రోగాలకు యోగా దివ్య ఔషధమని అన్నారు. ఈ కార్యక్రమానికి ఉత్తర భారతదేశం నుండి ప్రత్యేకంగా యోగా నిపుణులు విచ్చేసి యోగా యొక్క ఆవశ్యకతను చాటి చెప్పారు. సకల రోగాలకు సర్వ కలహాలకు మూలం నాలుక అని, క్రమ పద్ధతిలో సాత్వికాహారం తీసుకుంటూ ప్రతినిత్యం యోగాభ్యాసం చేయడం వల్ల డాక్టర్ల దగ్గరకు వెళ్లే అవసరం ఉండదని అన్నారు. భుజంగాసనం శలభాసనం, మత్స్యాసనం ధనురాసనం, యోగ ముద్ర, అర్థమత్స్యాందాసనం, వజ్రా సనం, తదితర ఆసనాల వల్ల జీవక్రియలు సక్రమంగా పనిచేస్తూ సుఖవంతమైన ఆరోగ్యకరమైన దినచర్యను అలవాటు చేసుకోవచ్చని మానసిక ప్రశాంతత, శారీరక ఉల్లాసాన్ని అందించేది యోగా మాత్రమేనని అన్నారు. యోగ వల్ల ఏకాగ్రత, చక్కని శారీరక వికాసం పెంపొందుతాయని అన్నారు. వందలాదిగా యోగసాధకులు వారం రోజులు యోగాలో గల విభిన్న అంశాలు మాతాజీ వద్ద నేర్చుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున యోగాబ్యాసకులు పాల్గొన్నారు.

## భారీ సైజు కందను పండించిన అన్నపరెడ్డి



**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** అవనిగడ్డ 3 వ వార్డుకు చెందిన అన్నపరెడ్డి వెంకటేశ్వరరావు తన మాగాణి పొలంలో భారీ సైజు కందను పండించి అందరి చేత ఔరా అనిపించుకున్నాడు. 3 వ వార్డుకు చెం దిన అన్నపరెడ్డి వెంకటేశ్వరరావు తన పొలంలో ఏ విధమైన మందులు పిచికారి చేయకుండా 22 కేజిల 300 గ్రాముల కంద దుంపను పండించ డంతో రైతులతో పాటు ప్రకృతి ప్రేమికులు ఆ కంద దుంపను చూసేందుకు పోటీపడుతున్నారు. మామూలుగా మాగాణి పంట పోలాల్లో ఎరువులు, పిచికారి మందులను అధిక మొత్తంలో వాడి రైతులు దిగుబడులు సాధిస్తారు. రైతు వెంకటేశ్వరరావు మాత్రం పశువుల ఎరువుతోనే వ్యవసాయాన్ని సాగు చేస్తూ అధిక దిగుబడులు సాధిస్తున్నారు. ఈ అధిక దిగుబడులు సాధించేందుకు సాటి రైతులు కూడా రసాయనిక ఎరువులు మాని పశువుల ఎరువుతో సాగుచేస్తే అధిక దిగుబడులతో పాటు ఆరోగ్యం కూడా బాగుంటుందని పలువురు పేర్కొంటున్నారు.

## సేవా దృక్పథం గల సంస్థ ఐవీఎం



**చల్లపల్లి -మేజర్ న్యూస్ :** నిరు పేదలకు సహాయ సహకారాలు అందించడంలో, విద్యార్థుల వి ద్యాభివృద్ధికి చేయూతను ఇవ్వ డంలో సేవా దృక్పథం గల సంస్థ ఐవీఎం అని విశ్రాంత డి.ఎస్.పి కె.హరి రాజేంద్ర బాబు అన్నారు. ఆదివారం ఇండియా విలేజ్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో రెండు ట్రై సైకిళ్లు, వీల్ చైర్ ను వికలాంగులకు అందజేశారు. చల్లపల్లి మండలం పాగోలుకు చెందిన ఉడుముల సత్యవతి, ఘంటసాల మండలం దేవరకోటకి చెందిన ఇటుకుల వెంకటేశ్వరరావు, గుడివాడ మండలం వానపాములకు చెందిన సందీప్ లకు ట్రై సైకిళ్లు, వీల్ చైర్ లను ఐ వి ఎం డైరెక్టర్ డాక్టర్ వేములపల్లి సురేష్, కె హరి రాజేంద్ర బాబు లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఐవీఎం ట్రస్ట్ సభ్యులు ఎన్. ఫణి, పి. రాజేష్, జి.ప్రసాద్ లు పాల్గొన్నారు.

## కుదరవల్లి,విరివాడలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర



**నందివాడ మేజర్ న్యూస్:** నందివాడ మండలం కుద రవల్లి, పెదవిరివాడ గ్రామంలో కేంద్ర ప్రభుత్వం ప్రవే శపెట్టిన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్య క్రమం ఆదివారం కుదరవల్లి విరివాడ గ్రామంలో జరిగింది. ఈ కార్య క్రమంలో మండల బిజెపి పార్టీ అధ్యక్షులు వాసుపల్లి వరప్రసాద్, మండల అభివృద్ధి అధికారి గ్రామ సర్పంచ్లు విస్తరణ అధికారి శ్రీనివాసరావు, మండల స్థాయి అధికారులు, ఒకుదరవల్లి సచివాలయ సిబ్బంది, కుధరవల్లి,పెద్దవిరివాడ గ్రామస్తులు పాల్గొన్నారు.



## అంగన్వాడీలపై ఎస్మా ఉపయోగించిన తగ్గేదే లేదు

**నందిగామ, జనవరి 7, మేజర్ న్యూస్:** రాష్ట్ర వ్యాప్తంగా అంగన్వాడీల సమ్మె 27వ రోజున కొనసాగుతుంది. 27 వ రోజు సమ్మె రూపంలో వినూత్నంగా నిరసన తెలియజేశారు.సిఐటియు ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి కె. గోపాల్, మా ట్లాడుతూ ఎస్మా చట్టం తీసుకొచ్చి అంగన్వాడీలపై నిర్బంధాలు ప్రయోగిం చటం సరైనది కాదు తక్షణమే జీవో నెంబర్ 2 రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీల సమస్యలు పరిష్కరించా లని రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీలు డిమాండ్ చేస్తుంటే సమస్యలు పరిష్కరిం చకుండా రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీలు చేస్తున్న సమ్మెను విచ్ఛిన్నం చేయ టానికి ఉద్యోగాలు తీసేస్తామని బెదిరింపు దూరంతో అధికారులు మంత్రులు బెదిరిస్తున్నారు. రాష్ట్రంలో ఏ ఉద్యోగులు సమ్మె చేసిన మీ ఉద్యోగాలు తీసే స్తామని అధికార పార్టీ నాయకులు చెబుతున్నారు 2024 లో జరిగే ఎన్ని కల్లో మీరు మా ఉద్యోగాలు తీయడం కాదు మేమే రేపు ఎన్నికల్లో మీ ఉద్యో గాలు తీస్తామని డిమాండ్ చేస్తున్నాం. ఇప్పటికైనా అంగన్వాడీ సమస్యలు తక్షణమే పరిష్కరించాలని అంగన్వాడిలో అడిగిన న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలి అన్నారు.ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి చనుమోలు సైదులు,సయ్యద్ ఖాసిం, వి.రవిశేఖర్,జి.గోపినాయక్ డివైఎఫ్ఐ జిల్లా నాయకులు లాల్ సాలయ్,కర్రి వెంకటేశ్వరరావు, ఏసోబు, జంగా దమోదర్, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్ సీనియర్ నందిగామ ప్రాజెక్టు కార్యదర్శి కోల్లి సరళ, మహాలక్ష్మి, లక్ష్మీ, వెంకట్రావమ్మ,వేణు, పిచ్చిమ్మ, వనిత, రాణి, మేరి పాల్గొన్నారు.

## ఘనంగా సీపీఎం సీనియర్ నేత 7వ వర్థంతి వేడుకలు



**వత్సవాయి జనవరి 7 మేజర్ న్యూస్ :** మండల కేంద్రంలో సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు మాజీ సొసైటీ అధ్యక్షులు నరమనేని రామయ్య 7వ వర్ధంతి ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు చిరుమామిళ్ళ హనుమంతురావు మాట్లాడుతూ ప్రజా సమస్యలపై నిరంతరం పనిచేసిన వారు ప్రజల హృదయాల్లో శిరస్థాయిగా నిలిచిపోతారని అన్నారు. అనంతరం మండల సిపిఎం పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ రామయ్య సిపిఎం పార్టీ అభివృద్ధికి, వత్సవాయి సొసైటీ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని అన్నారు. రైతులకు ఖరీఫ్ సీజన్లో విత్తనాలు, ఎరువులు అందించడంలో ముందంజలో ఉండేవారని అన్నారు. ప్రతి రైతుకి సొసైటీ నుంచి వచ్చే సంక్షేమ పథకాలను అందించేవారని కొనియాడారు. సొసైటీ ద్వారా రుణాల అందించడంలో రైతులకు ఎక్కువగా తోడ్పడేవారని పేర్కొన్నారు ఆయన ఆశయాలను నెరవేరుస్తామని తెలిపారు. ఆయన లేని లోటు పార్టీకి తీరని లోటు అని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కార్యదర్శి తమ్మినేని రమేష్ మండల కమిటీ సభ్యులు కంచర్ల కొండయ్య,బి రాము, వెంకటరత్నం, భూ తపల్లి బిక్షం, జాను కోటయ్య తదితరులు ఘనంగా నివాళులు అర్పించారు.

## అయోధ్య అక్షింతలు పంపిణీ



**జి.కొండూరు మేజర్ న్యూస్ :** కోదండ రామాలయం నుండి అయోధ్య నుండి వచ్చిన అక్షింతలను జి కొండూరు గ్రామంలో అన్ని వీధులు తిరుగు తూ ఆదివారం పంపిణీ చేశారు. ప్రతి ఇంటికి రామ భజన కీర్తనలతో ఊరేగింపుగా మహిళలు పెద్ద ఎత్తున అక్షింతలను పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరూ ఈ అక్షింతలను పూజా మందిరంలో ఉంచుకొని వారి శు భకార్యాలలో ఈ అక్షంతలను ఉపయోగించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు నాగరాజు రాజా రామారావు తో పాటు భజన బృందం సుజాత శేషు అనేకమంది మహిళా భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని రామకీర్తనలతో గ్రామ పుర వీదులలో ప్రతి ఇంటికి ఈ అక్షింతలను రాముల వారి కరపత్రాలను అందచేశారు.



## అనాధీనం భూముల హక్కులు తొలగిస్తే ఉద్యమిస్తాం

**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** అనాధీనం భూములపై రైతులకు ఉన్న హక్కులు తొలగిస్తే ఉద్యమిస్తాం అని జనసేన మండల పార్టీ అధ్యక్షులు గుడివాక శేషు బాబు అన్నారు. ఆదివారం ఆయన తన పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ 2018 వ సంవత్సరంలో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం జిఓ నెం 575ను తీసుకువచ్చి సెక్షన్ 22ఎ నిషేధిత భూముల జాబితా నుండి ఆనాధీనం కేటగిరి భూములను తొలగించాలని అధికారులను ఆదేశిస్తే గడిచిన నాలుగున్నర సంవత్సరాల నుండి అధికార పక్షం నిమ్మకు నీరెత్తినట్లుగా ప్రవర్తిస్తూ ఆ భూములను నిషేధిత భూముల జాబితా నుండి తొలగించక పోగా ప్రస్తుతం జరుగుతున్న రీ సర్వే పేరుతో ఇప్పటికే రైతులకు ఉన్న హక్కులను తొలగించడం దారుణమైన విషయం అని శేషుబాబు విమర్శించారు. సెక్షన్ 22ఎ నిషేధిత భూముల జాబితా నుండి ఎన్నో వేల ఎకరాలను తొలగించామని, గొప్పలు చెప్పుకుంటున్న ఎం.ఎల్.ఎ సింహాద్రి రీ సర్వే వల్ల అనాధీనం భూములు రైతులు ప్రత్యక్షంగా నష్టపోతుంటే సోద్యం చూస్తున్నారని ఎద్దేవా చేశారు. రీ సర్వే వల్ల రైతులకు, ప్రజలకు మేలు జరిగే విధంగా ఉండాలి కానీ, నష్టం జరగకూడదని అన్నారు. పట్టాదారు పాసుపుస్తకాలు పొంది ఆన్‌లైన్‌లో ఇప్పటి వరకు పట్టాదారుగా నమోదు అయిన రైతుల పేర్లు రీ సర్వే తరువాత ఆన్‌లైన్ లో కనిపించకుండా పోయాయని, ప్రభుత్వం నుండి ఎటువంటి సబ్సీడీలు పొందలేరని, బ్యాంక్‌ల నుండి ఋణాలు కూడా పొందలేరని, తమ భూముల మీద ఉన్న హక్కులను కోల్పోతారని గుడివాక ఆవేదన వ్యక్తం చేశారు. గత నెలలో వచ్చిన మిచాంగ్ తుఫాన్ కారణంగా రైతులు ఇప్పటికే పీకల లోతు కష్టాల్లో ఉంటే ఈ రీ సర్వే అపార నష్టాన్ని కల్గించకూడదని వారం క్రితం జనసేన పార్టీ తరుపున ప్రభుత్వం దృష్టికి పత్రికా ముఖంగా ఈ సమస్యను తీసుకువెళ్లడం జరిగిందని స్పందన మాత్రం శూన్యం అని ఇప్పటికైనా శాసనసభ్యులు కలుగచేసుకుని రెవెన్యూ మంత్రి, అధికారులతో మాట్లాడి రైతుల పేర్లు ఆన్‌లైన్ అడంగల్‌లో తొలగించకుండా ఉండేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. వైసిపి ప్రభుత్వం స్పందించకపోతే రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరికలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎం.పి.టి.సి బొప్పన బాబు, పప్పుశెట్టి శ్రీను, ఆకుశెట్టి రవి, తోట ఆంజనేయులు, గుడివాక రామాంజనేయులు, పంచాయితీ వార్డు సభ్యులు అడపా ప్రభాకర్, కమ్మిలి సాయి, మోహన్, తుంగల నరేష్, బొంతు ప్రకాష్, రేపల్లె లక్ష్మణ, పవన్ కళ్యాణ్ లతో పాటు పలువురు జనసైనికులు పాల్గొన్నారు.

## అవనిగడ్డ- కోడూరు ప్రధాన రహదారి వెంటనే నిర్మాణం చేపట్టాలి



**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** అవనిగడ్డ – కోడూరు ప్రధాన రహదారి నిర్మాణం వెంటనే చేపట్టి రోడ్డు ప్రమాధాలను నిరోధించాలని జనసేన మండల పార్టీ అధ్యక్షులు గుడివాక శేషుబాబు అన్నారు. ఆదివారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ రెండు రోజుల క్రితం కోడూరు మండలం బడేవారిపాలెం గ్రామానికి చెందిన అర్జా వేణుగోపాల్ 18 సంవత్సరాల యువకుడు రోడ్డు ప్రమాధంలో మృతి చెందడం చాలా బాధాకరం అని, మరణించిన వేణుగోపాల్‌కు పార్టీ తరుపున నివాళ్ళు అర్పించారు. ఈ విధంగా రోడ్డు ప్రమాధాలు జరుగుతున్నప్పటికి అధికార పార్టీ కళ్ళు ఉండి కూడా చూడలేని కబోధి పక్షిలా వ్యవహరించడం దురదృష్టకరం అని అవనిగడ్డ– కోడూరు ప్రధాన రహదారి నుండి కొత్తపాలెం నుండి వేణుగోపాలపురం వరకు ఉన్న రహదారిని నిర్మించి ప్రమాధాలను నివారించాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎం.ఎల్.ఎ సింహాద్రి రమేష్‌బాబు ఇచ్చిన మాటలు ఎప్పుడో గాలిలో కలిసిపోయాయని, ఈ వైసిపి ప్రభుత్వానికి నరకయాతన పడుతున్న ప్రజల బాధలు పట్టవా అని ధ్వజమెత్తారు. రోడ్డు నిర్మాణం కోసం టెండర్ దారులు వెనక్కి వెళ్ళిపోయారని, ఎన్నికలు సమీపి స్తుండటంతో కాంట్రాక్టర్లు కూడా ముందుకు రావడం లేదని, కోడూరు రహదారిని నిర్మించకపోతే కోడూరు మండలం ప్రజలను ఓట్లు అడగను అని, ఎదురుమొండి బ్రిడ్జి నిర్మాణం చేయకపోతే అక్కడ దీవుల ప్రజల ఓట్లు అడగనని శపధం చేసిన సింహాద్రి ఇక ఇంటికే పరిమితం కానున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వంపై వత్తిడి పెంచి అవనిగడ్డ– కోడూరు ప్రధాన రహదారి నిర్మాణం చేపట్టకపోతే నియోజకవర్గ ప్రజలకు ఎం.ఎల్.ఎ బహిరంగ క్షమాపణ చెప్పాలని శేషుబాబు హితవు పలికారు. ఈ కార్యక్రమంలో ఎం.పి.టి.సి బొప్పన బాబు, పప్పుశెట్టి శ్రీను, ఆకుశెట్టి రవి, తోట ఆంజనేయులు, గుడివాక రామాంజనేయులు, పంచాయితీ వార్డు సభ్యులు అడపా ప్రభాకర్, కమ్మిలి సాయి, మోహన్, తుంగల నరేష్, బొంతు ప్రకాష్, రేపల్లె లక్ష్మణ, పవన్ కళ్యాణ్ లతో పాటు పలువురు జనసైనికులు పాల్గొన్నారు.

# జన భగీదరి పేరుతో జిల్లా వ్యాప్తంగా పలు కార్యక్రమాలు



**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** ఈనెల 19వ తేదీన విజయవాడలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 125 అడుగుల విగ్రహం ఆవిష్కరణ నేపథ్యంలో ముందస్తుగా జన భగీదరి పేరుతో జిల్లా వ్యాప్తంగా పలు కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు సంబంధిత అధికారులను ఆదేశించారు. విజయవాడ స్వరాజ్ మైదానంలో ఈనెల 19వ తేదీన 125 అడుగుల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కాంస్య విగ్రహము, స్మృతి వనము ఆవిష్కరణ కార్యక్రమం జరుగునుందన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు విగ్రహ ఆవిష్కరణకు ముందుగా ఈనెల 9వ తేదీ నుండి 18వ తేదీ వరకు సంస్మరణ చేసుకుంటూ జన భగీదరి కార్యక్రమాలను జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా నిర్వహించాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమాలను సజావుగా నిర్వహించేందు కోసం జిల్లా స్థాయి కమిటీని ఏర్పాటు చేశామన్నారు. ఇందులో సంయుక్త కలెక్టర్ సభ్య కన్వీనర్ గా, జిల్లా పంచాయతీ అధికారి, జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కమిషనర్, జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారత అధికారి, మెప్మా డి ఆర్ డి ఏ ప్రాజెక్టు డైరెక్టర్లు, జిల్లా విద్యాధికారి సభ్యులుగా ఉంటారన్నారు. ఇందులో భాగంగా గ్రామ వార్డు సచివాలయాల స్థాయిలో పౌరులను, స్థానిక ప్రజాప్రతినిధులను ఆహ్వానించి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారందరూ ఫ్లెక్సీ బ్యానర్ పై డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చూపిన మార్గంలో పయనిస్తామని మద్దతు తెలుపుతూ, ప్రతిజ్ఞ చేస్తూ ఫ్లెక్సీ బ్యానర్ పై సంతకం చేసేలా చూడాలన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో ఒక్కో గ్రామం, వార్డు నుండి ప్రజలు 5 మంది పాల్గొనేలా చైతన్య పరచాలన్నారు. ఈ సందర్భంగా వారి గ్రామాలు, మున్సిపల్ ప్రాంతాల్లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాలను శుద్ధిచేసి సుందరంగా తీర్చిదిద్ది పూలమాలలతో అలంకరించాలన్నారు. అనంతరం భారత రాజ్యాంగం లోని ఉపోద్ఘాతంతో ప్రతిన పూనాలన్నారు. అంతేకాకుండా ఎస్సీ కాలనీలలో సామాజిక న్యాయం పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అలాగే జిల్లా స్థాయిలో జిల్లా కేంద్రంలో మారతాన్ పరుగు నిర్వహించాలని, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జీవిత చరిత్రను తెలియజేసే ఛాయాచిత్ర ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు, నిర్వహించాలన్నారు. అలాగే రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేయాలని, జిల్లా స్థాయిలో సమావేశం నిర్వహించి విద్యావేత్తలు, సామాజిక న్యాయం కోసం పనిచేసే ప్రతినిధులు, సంస్థలను ఆహ్వానించాలన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణలో పాల్గొంటున్న వారి రాకపోకలకు సరైన ప్రణాళికను రూపొందించుకోవాలన్నారు. అన్ని పాఠశాలల్లో చిత్రలేఖనం, వ్యాసరచన, చర్చ కార్యక్రమాలు, క్విజ్ వంటి పోటీలను కూడా నిర్వహించాలన్నారు. కృష్ణా విశ్వవిద్యాలయంతో పాటు అన్ని కళాశాలల్లో సామాజిక న్యాయం పై విద్యార్థులతో చర్చ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.

# 19న అంబేద్కర్ విగ్రహావిష్కరణకు తరలిరండి



**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** ఈనెల 19న రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం కానున్న 125 అడుగుల ఎత్తు కలిగిన భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణకు ప్రజలందరూ స్వచ్ఛందంగా తరలిరావాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ కోరారు. ఆదివారం సాయంత్రం ఆయన స్థానిక ఆర్ అండ్ బి అతిథి గృహంలో పాత్రికేయుల సమావేశం నిర్వహించి విజయవాడలో నూతనంగా రూపుదిద్దుకున్న బాబాసాహెబ్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణపై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశానికి దిక్సూచి, ప్రపంచ మేధావి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 125 అడుగుల ఎత్తైన విగ్రహాన్ని విజయవాడలోని స్వరాజ్య మైదానంలో ఈ నెల 19వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆవిష్కరించనున్నారని, ఈ కార్యక్రమానికి కుల మత వర్గ విభేదాలు లేకుండా ప్రజలందరూ స్వచ్ఛందంగా తరలిరావాలని కోరారు. రాజకీయాలకు కేంద్ర బిందువు, వాణిజ్య కేంద్రంగా విరాజిల్లుతున్న విజయవాడ నడిబొడ్డున అతి ముఖ్యమైన స్థలం స్వరాజ్య మైదానంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని నిర్మించడానికి రాష్ట్ర ప్రభుత్వం పూనుకొని సముచిత స్థానం కల్పించినందుకు అంబేద్కర్ అభిమానులు, రాష్ట్ర ప్రజలందరి తరపున ముఖ్యమంత్రికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఒక గొప్ప పండుగగా నిర్వహించనున్నదని, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కేవలం ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ వర్గాల వారికి మాత్రమే సంబంధించిన వ్యక్తి కాదని, దేశంలోని ప్రజలందరికీ స్వేచ్ఛ, సమానత్వం కల్పించిన గొప్ప వ్యక్తి విగ్రహావిష్కరణకు రాష్ట్రవ్యాప్తంగా లక్షలాదిగా ప్రజలు స్వచ్ఛందంగా తరలిరావాలని చైర్మన్ ఈ సందర్భంగా కోరారు.

# నిర్వీర్యమైన బ్రాహ్మణ కార్పొరేషన్‌ను పునరుద్ధరిస్తాం



**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి రాగానే నిర్వీర్యమైన బ్రాహ్మణ కార్పొరేషన్ ను పునరుద్ధరిస్తామని మాజీ మంత్రి, తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు, కొల్లు రవీంద్ర అన్నారు. తెలుగుదేశం పార్టీ అనుబంధ విభాగం బ్రాహ్మణ సాధికార కమిటీ జిల్లా కన్వీనర్ గా నూతనంగా నియమితులైన పి. వి. ఫణి కుమార్ ఆదివారం మచిలీపట్నంలో మాజీ మంత్రి కొల్లు రవీంద్రను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కొల్లు రవీంద్ర మాట్లాడుతూ చంద్రబాబు ప్రప్రథమంగా ప్రవేశపెట్టిన బ్రాహ్మణ కార్పొరేషన్ ద్వారా నిరుపేద బ్రాహ్మణులకు సబ్సిడీపై రుణాలు అందించామన్నారు. నిరుపేద బ్రాహ్మణ యువతీ యువకులకు విదేశాలు వెళ్లి చదువుకునేందుకు పది లక్షల రూపాయలు గత టిడిపి ప్రభుత్వంలో అందజేశాము అన్నారు. బ్రాహ్మణ యువతులకు పెళ్లిళ్ల నిమిత్తం పెళ్ళికానుక అందజేశాము అన్నారు. వేద విద్యను ప్రోత్సహించే విధంగా వేదం చదువుకునే విద్యార్థులకు కూడా ప్రోత్సాహకాన్ని అందజేశాము అన్నారు. నేటి వైసిపి ప్రభుత్వం బ్రాహ్మణ కార్పొరేషన్ ను నిర్వీర్యం చేసి బ్రాహ్మణుల సంక్షేమాన్ని గాలికి వదిలేసింది అన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి రాగానే నిర్వీర్యం కాబడిన బ్రాహ్మణ కార్పొరేషన్ మరలా పునరుద్ధరించి నిరుపేద బ్రాహ్మణులను ఆదుకుంటాము అన్నారు. తెలుగుదేశం పార్టీ అనుబంధ విభాగం కృష్ణ జిల్లా బ్రాహ్మణ సాధికార కమిటీ కన్వీనర్, పి. వి. ఫణి కుమార్ మాట్లాడుతూ మచిలీపట్నం నియోజకవర్గంలో మాజీ మంత్రి కొల్లు రవీంద్ర, మాజీ పార్లమెంటు సభ్యులు కొనకళ్ళ నారాయణరావు, అప్పటి బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్, వేమూరి ఆనంద సూర్య ల సహకారంతో కోట్లాది రూపాయల సొమ్మును బ్రాహ్మణ కార్పొరేషన్ ద్వారా వివిధ రకాల సబ్సిడీ పథకాలను, ఉపకార వేతనాలను, బ్రాహ్మణ కార్పొరేషన్ ద్వారా భార్యాభర్తలు ఇద్దరికీ పెన్షన్ ఇలా ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు మచిలీపట్నం నియోజకవర్గంలో గత టిడిపి ప్రభుత్వంలో అందజేయడం జరిగింది అన్నారు. బ్రాహ్మణులకు ఎల్లప్పుడూ అండగా ఉండేది తెలుగుదేశం పార్టీ అన్నారు. వచ్చే ఎన్నికలలో తెలుగుదేశం పార్టీని గెలిపించుకోవాల్సిన ఆవశ్యకత బ్రాహ్మణులందరి పై ఉంది అన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తేనే బ్రాహ్మణులకు భవిష్యత్తు ఉంటుంది అన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘం నాయకుడు, లక్కావజ్ఝల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# అర్హతలు ఉన్న వారందరికీ సంక్షేమ పథకాలు అమలు చేశాం



ఉద్దేశపూర్వకంగా ఏ ఒక్కరిని ఇబ్బంది పెట్టలేదు

సాధ్యమైనంత వరకు నిధులు తెచ్చి మైలవరం నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశా

ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ మనోగతం

**జి.కొండూరు మేజర్ న్యూస్ :** తను శాసనసభ్యునిగా గెలిపించిన మైలవరం నియోజకవర్గ ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం సాధ్యమైనంత వరకు శక్తివంచన లేకుండా కృషి చేశానని, అర్హతలు ఉన్న వారందరికీ సంక్షేమ పథకాలను ఖచ్చితంగా అమలు చేశామని, ఉద్దేశపూర్వకంగా ఏ ఒక్కరికి సంక్షేమ పథకాల విషయంలో ఇవ్వడానికి వీల్లేదని అడ్డుపడలేదని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ పేర్కొన్నారు. జి.కొండూరులో పెంచిన పింఛన్లు పంపిణీ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ ఒక్క తమ్ముడు మీద కానీ, ఏ ఒక్క కుటుంబం మీద కానీ కక్ష సాధింపు చర్యలకు పాల్పడలేదన్నారు. చేస్తే మంచి చేద్దామని, ఏ ఒక్కరికీ చెడు చేయవద్దన్నారు. ఇదే నినాదంతో నాలుగున్నర ఏళ్లుగా పని చేశానన్నారు. కొన్ని జరగని పనులు ఏమైనా ఉంటే, అది తమ వల్ల, మా ప్రజాప్రతినిధుల వల్ల జరగలేదని అనుకోవడం పొరబాటు అన్నారు. వ్యవస్థాపరమైన లోపాలు, సాంకేతిక కారణాల వల్ల ఏమైనా కొన్ని పనులు జరగలేదు తప్పితే, నియోజకవర్గ వ్యాప్తంగా ఏ ఒక్కరి పని ఉద్దేశ్య పూర్వకంగా ఆపలేదన్నారు. కోవిడ్ సంక్షోభంలో కూడా సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇచ్చామన్నారుమైలవరం నియోజకవర్గం అభివృద్ధి పనుల విషయంలో జిల్లాలోని ప్రథమ స్థానంలో ఉందన్నారు. ఎంత అభివృద్ధి చేసినా ఏదో ఒక పని మిగిలిపోతూనే ఉంటుందన్నారు. అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియ అని, తాము చేసిన అభివృద్ధితో ఇప్పటికిప్పుడు మైలవరం నియోజకవర్గం స్విట్జర్లాండ్, అమెరికా, లండన్ వంటి దేశాల సరసన చేరిందని తను చెప్పడం లేదన్నారు. అభివృద్ధి చేయాలనే సంకల్పం, చిత్తశుద్ధి, కార్యదీక్ష, పట్టుదల మనసులో ఉండాలన్నారు. తను మాత్రం ఎక్కడ అవకాశం కుదిరితే అక్కడ ప్రతి ఒక్క రూపాయి తీసుకువచ్చి మైలవరం నియోజకవర్గ అభివృద్ధి కోసం శ్రమించినట్లు వెల్లడించారుప్రతిపక్ష ప్రజాప్రతినిధుల వద్ద కూడా నిధులు తెచ్చామన జగనన్న ప్రభుత్వంలోని మంత్రుల వద్ద, ప్రతిపక్ష పార్టీకి చెందిన ఎంపీలు సుజనాచౌదరి, కనకమేడల రవీంద్ర కుమార్, కేశినేని శ్రీనివాస్ (నాని)ల దగ్గర నుంచి కూడా నిధులు తీసుకువచ్చి అభివృద్ధి పనులు పూర్తి చేశామన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి ఎవరు ఒక్క రూపాయి ఇస్తానన్నా సరే వాళ్ళ వద్దకు వెళ్లి చేతులు ఎత్తి నమస్కరించి నిధులు తెచ్చినట్లు స్పష్టం చేశారు. అభివృద్ధి పనుల విషయంలో తనవరకు మానసికంగా పూర్తిగా సంతృప్తి లేకపోయినా, తన పరిధి మేరకు తనకు ఉన్న నిధుల లభ్యతను బట్టి నియోజకవర్గంలో విస్తృతంగా పనులు చేసినట్లు పేర్కొన్నారు. సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైయస్సార్ పట్టణ గ్రామీణ, ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ హాళ్లు, సొసైటీ భవనాలు, గోదాములు, నాడు-నేడు కింద ఆసుపత్రులు, పాఠశాలల భవనాలు, సిమెంట్ రహదారులు, డ్రైనేజీలు, బీటీ రోడ్లు, పేదలకు ఇళ్లస్థలాలు, పక్కాగృహాలు, తదితర అభివృద్ధి పనులను పూర్తి చేసినట్లు వెల్లడించారు. ముఖ్యమంత్రి జగన్మోహన్రెడ్డి నాయకత్వంలో వార్డు మెంబర్ దగ్గర నుంచి ఎమ్మెల్యే వరకు తమ బాధ్యతలను తాము ఎటువంటి కుట్రలు, కుతంత్రాలు లేకుండా సక్రమంగా నిర్వర్తించామని స్పష్టం చేశారు.

# తిరుపతమ్మ వారి దేవస్థానం అభివృద్ధికి కృషి.



**జగ్గయ్యపేట జనవరి 7 మేజర్ న్యూస్ :** పెనుగంచిప్రోలు గ్రామంలో వేం చేసి ఉన్న శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ వారి దేవస్థానాన్ని 14 కోట్ల రూపాయలతో అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నట్లు ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను తెలిపారు. పాపమాంబ కళ్యాణవనం నందు 5కోట్లతో కళ్యాణ మండపం నిర్మాణ పనులను ఆలయ చైర్మన్ జంగాల శ్రీనివాస్ తో కలిసి ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ 14 కోట్ల రూపాయలతో దేవస్థానం నందు డార్మెటరీ, కేశఖండనశాల, కళ్యాణ మండపం, తదితర అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ఈ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేసి భక్తులకు అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సమస్యలపై పరిష్కారం కోసం కార్మికులకు బొర్ర కిరణ్ మద్దతు



**జి.కొండూరు మేజర్ న్యూస్ :** సమస్యల పరిష్కారం కోసం గత 13 రోజులగా మున్సిపల్ కార్మికులు చేపట్టిన సమ్మె కు మద్దతు గా ఆదివారం కొండపల్లి దీక్షా శిబిరంలో స్థానిక కాంగ్రెస్స్ పార్టీ నాయకులతో 'ఎన్టీఆర్ జిల్లా కాంగ్రెస్స్ పార్టీ అధ్యక్షులు బొర్రా కిరణ్', పీసీసీ ప్రధాన కార్యదరిశి పోతురాజు ఏసుదాస్ కూర్చొన్నారు.. ఈ సందర్భంగా బొర్రా కిరణ్ మాట్లాడుతూఈ రోజు కొండపల్లిలో గత 13 రోజులగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్న మునిసిపల్ కార్మికులకు అండగా కాంగ్రెస్స్ పార్టీ ఉంటది అని ధైర్యం చెప్తూ శిబిరం దగ్గరకు వెళ్లి వారితో కలసి దీక్షలో కూర్చున్నాము అని అన్నారు.ఎన్నికల ముందు జగన్ పాదయాత్రలో ఇచ్చిన హామీలనే నెరవేర్చాలని,మునిసిపల్ కార్మికుల సమ్మె న్యాయమైనదేనని, ఎన్నికల ముందు హామీ ఇచ్చి ఇప్పుడు అమలు చేయకపోవడం దారుణమన్నారు.కార్మికుల కోసం అండగా వుండే సీఐటీయూ నాయకుల అద్వర్యం లో జరిగే ఈ సమ్మె కు మా పూర్తి మద్దతు ఉంటది అని తెలియచేస్తూ,ఈ రోజు శిబిరం దగ్గర వున్న సిఐటీయూసీ నాయకులు ఎం మహేష్ తో రాష్ట్ర పీసీసీ అధ్యక్షులు గిడుగు రుద్రరాజు తో ఫోన్ లో మాట్లాడించి మద్దతు తెలియచేయటం జరిగింది అని అన్నారు.ఎన్నికల సమయంలో సమాన పనికి సమాన వేతనం, కాంటాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేస్తామని జగన్మోహన్ రెడ్డి హామీలు ఇచ్చారని.,చంద్రబాబు టీడీపీ ప్రభుత్వం చేయలేని పని తాము చేసి చూపిస్తాం అన్నారని అన్నారు.ఆయన మాటలు నమ్మి కార్మికులు ఓట్లు వేసి గెలిపించారని అన్నారు.ఈ ఐదేళ్లుగా హామీలు అమలు చేయకుండా జగన్మోహన్ రెడ్డి మోసం చేశారని కిరణ్ విమర్శించారుకరోనా సమయంలో ప్రాణాలు తెగించి పని చేసిన కూడా ఈ ప్రభుత్వానికి ఎటువంటి జాలి దయ లేదని అన్నారు.కార్మికులు ఈ ప్రభుత్వాన్ని నమ్మినందుకు బాగా బుద్ధి చెప్పారన్నారు.వచ్చే ఎన్నికల్లో కార్మికులు కూడా ఈ ప్రభుత్వానికి తప్పకుండా బుద్ధి చెబుతారని అన్నారు.జగన్ ప్రభుత్వం దిగి వచ్చేంత వరకు,మా సమస్యలకు పరిష్కారం తెలిపేవరకు మేము దీక్షలను విరమించేదే లేదని కార్మికులు అంటున్నా కూడా,ఈ ప్రభుత్వం మొద్దు నిద్ర వీడక పోవటం బాధాకరం అని బొర్రా కిరణ్ అన్నారు.ఈ కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదరిశి పోతురాజు ఏసుదాస్.,మాజీ పంచాయతీ మెంబర్లు అక్కల ప్రసాద్,చెరుకు ఆనందరావు,రాగాల రాము,పార్టీ నాయకులు పోతురాజు థామస్ పాల్,బోడి వెంకటరావు, నాయకులు పాల్గొన్నారు.



## లంకలితీష్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ

**జి.కొండూరు మేజర్ న్యూస్ :** నియోజకవర్గంలో రా కదలిరా అంటూ పిలుపునిచ్చిన నారా చంద్రబాబునాయుడు ఆదేశం మేరకు మైలవరం తెలుగు యువత అధ్యక్షుడు లంక లితిష్ ఆధ్వర్యంలో మైలవరం లితీష్ ఇంటి దగ్గర నుండి వందల సంఖ్యలో బైక్లు తిరువూరు మహాసభకు ర్యాలీ గా పయనమయ్యాయి. ప్రతి కార్యకర్త, ప్రతి తెలుగు యువత నాయకుడు పసుపు జెండా చేత బూని జై చంద్రబాబు జై దేవినేని ఉమా అంటూ నినాదాలతో, జాతీయ రహదారిని హోరెత్తించి మరి తిరువూరు పైనమయ్యారు.

## శ్రీ రంగనాయక స్వామి గరుడోత్సవం



**జగ్గయ్యపేట: జనవరి 7 మేజర్ న్యూస్ :** పట్టణంలోని ప్రాచీన దేవాలయమైన రంగనాయక స్వామివారి ఆలయంలో గరుడోత్సవం వైభవంగా జరిగింది. ఆదివారం పాలేటి తీరంలో కొలువై ఉన్న శ్రీ భూ గోదా సమేత రంగనాయక స్వామివారి ఆలయంలో స్వామి అమ్మ వాళ్లకు అర్చకులు విశేష పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా పూలతో అలంకరించిన రథముపై గరుత్మంతుని వాహనా నుంచి స్వామి అమ్మ వాళ్ళ ఉత్సవ మూర్తులను ఉంచి రథంపై చిన్న పీఠంపై ఆండాళ్ అమ్మవారి ఉత్సవ మూర్తిని ఉంచి గరుడ వాహన సేవను సాంప్రదాయంగా నిర్వహించారు. శ్రీ వెండి మహాలక్ష్మి అమ్మవారి ఆలయ మహిళా కమిటీ భక్తులు కోలాటం వేస్తూ ముందుకు సాగగా భక్తులు గోవింద నామస్మరణతో గరుడోత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. జే ఆర్ సి విద్యాసంస్థల ప్రతినిధి రంగాపురం నరసింహారావు కుటుంబ సభ్యులు సహకారంతో జరిగిన ఈ గరుడ వాహన సేవలో విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.రంగాపురం నరసింహారావు రుక్మిణి, రంగాపురం నాగేశ్వరావు పద్మావతి , రంగాపురం శ్రీనివాసరావు శోభారాణి ,రంగాపురం రాఘవేంద్ర అనూష, రంగాపురం మణికంఠ, , సత్తుపతే శివ, భక్తులు తదితర బంధుమిత్రువులు పాల్గొన్నారు

## ప్రభుత్వం దృష్టికి సమస్యలు తీసుకెళ్తా



**విజయవాడ, మేజర్ న్యూస్ :**గ్రామీణ రక్షిత సమగ్ర పథకాలలో వివిధ స్కీములలో విధులు నిర్వహిస్తున్న కార్మికులను అవుట్ సోర్సింగ్ కార్పొరేషన్ లో చేర్చే ప్రక్రియపై ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారాన్ని కృషి చేస్తారని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమం సలహాదారు ఎన్. చంద్రశేఖర్ రెడ్డి హామీ ఇచ్చారు. గ్రామీణ రక్షిత పథకాల (ఆర్ డబ్ల్యూఎస్ ) విభాగాల్లోని కాంప్రహెన్సివ్ ప్రొటక్ట్ వాటర్ సోర్స్ (సీపీడబ్ల్యూ) స్కీముల్లో విధులు నిర్వహిస్తున్న కార్మికుల రాష్ట్ర సమావేశాన్ని విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించారు. దీనికి యూనియన్ గౌరవాధ్యక్షులు వినుకొండ రాజారావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో అవుట్ సోర్సింగ్ కార్పొరేషన్ ద్వారా రెండు లక్షల మంది ఉద్యోగులకు భరోసా కల్పించి చిన్న స్థాయి ఉద్యోగులను ఆదుకున్నటువంటి సీఎం జగన్ కు ధన్యవాదాలు తెలిపారు. ఆర్ డబ్ల్యూఎస్ సమగ్ర నీటి సరఫరా విభాగాల్లో వివిధ క్యాడర్లు, ఎలక్ట్రీషన్, లైన్ మెన్, ఫిట్టర్లు, అటెండర్లు, తదితరులు 20 ఏళ్లుగా విధులు నిర్వహించే వారిని కాంట్రాక్టు వ్యవస్థ నుంచి ఆప్కాస్ లోకి చేర్చడానికి ప్రయత్నిస్తానని చెప్పారు. ప్రభుత్వం దృష్టికి వారి సమస్యలు తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని స్పష్టం చేశారు. వినుకొండ రాజారావు మాట్లాడుతూ కార్మికులతో వెట్టి చాకిరి చేయించుకోవటం దారుణమని ప్రభుత్వం వెంటనే వీరిని ఆప్కాస్లో చేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ గోసిపాతల శ్రీనివాస్, యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు రాయుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ప్రసాద్ బాబు, గోపాల్, మల్లికార్జున్, కృష్ణ, ఉపాధ్యక్షులు బోయిన శ్రీనివాసులు, అసోసియేట్ ప్రెసిడెంట్ హేమలత, ఉపాధ్యక్షురాలు కే పద్మ, సలహాదారులు ప్రసాద్, జాయింట్ సెక్రెటరీ సురేంద్ర, ఆవుల కళ్యాణి, రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి పెద్దఎత్తున కార్మికులు పాల్గొన్నారు.